# కేబినెట్ విస్తరణకు సర్కార్ బ్రేక్!

రెడ్డి వర్సెస్ బీసీ, ఎస్సీ సామాజిక సమీకరణాల మధ్య సమతుల్యత సాధించడం దాదాపు అసాధ్యంగా మారడంతోనే విస్తరణ నిర్ణయాన్ని వాయిదా వేశారు.

## పాలనపై దృష్టి సారించాలని ఆదేశాలు

ఢిల్లీ వేదికగా ఏఐసీసీ పెద్దలు తెలంగాణ నేతలకు చాలా స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. పొలిటిక్స్ పక్కనపెట్టి, పాలనపై దృష్టి సారించాలని, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి వేగంగా తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి 45 రోజులకు ఒకసారి పీసీసీ సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించి.. ప్రభుత్వం, పార్టీ యంత్రాంగం మధ్య సయోధ్యను పెంచాలని ఆదేశించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, ఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టి పెట్టాలని, మంత్రి పదవుల కోసం ఢిల్లీ చుట్టూ తిరగడం కన్నా నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఆశావహులకు నర్మగర్భ హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. హైకమాండ్ వ్యూహాన్ని గమనిస్తే పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన వేళ, ఈ రకమైన అంతర్గత కుమ్ములాటలు, ముఠా తగాదాలు బయటపడితే అది కాంగ్రెస్ ఇమేజ్‌ను ప్రజల్లో దెబ్బతీస్తుందనే ఆందోళన వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే కేబినెట్‌ను కదిలించి తేనెతుట్టెను రేపడం కంటే ఉన్న వనరులతోనే పాలనను పరుగులు పెట్టించడం శ్రేయస్కరమని భావిస్తున్నారు. ఢిల్లీ పర్యటనతో ఏదో ఒక శుభవార్త వింటామని భావించిన ఆశావహులకు అధిష్ఠానం రివర్స్ షాక్ ఇచ్చిందనే చెప్పాలి. పదుల సంఖ్యలో ఉన్న మంత్రి పదవుల పోటీదారులకు చెక్ పెడుతూ, సర్కార్ గ్రాఫ్‌ను పెంచుకునే పనుల్లో నిమగ్నం కావాలని ఆదేశించడంతో తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ప్రస్తుతానికి మళ్లీ మొదటికొచ్చినట్లే కనిపిస్తోంది.

# సోలార్ రంగంలో మరో విప్లవం

ఈ పథకం ప్రాథమిక లక్ష్యం.

## ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన అంటే ఏమిటి?

ప్రధాన మంత్రి సూర్య సరోవర్ యోజన కింద 5,000 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయనున్నారు. దీంతో పాటు, 10,000 మెగావాట్-గంటల సామర్థ్యం గల బ్యాటరీ నిల్వ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం ఈ ప్రాజెక్టులను 2026- 2027 నుంచి 2030- 2031 ఆర్థిక సంవత్సరాల మధ్య ఆమోదించబడతాయి. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ఆర్థిక సహాయ పంపిణీ 2033 వరకు కొనసాగుతుంది.

## తేలియాడే సౌర ప్రాజెక్టులు అంటే ఏమిటి?

తేలియాడే సౌర విద్యుత్ ప్లాంట్లు అంటే భూమిపై కాకుండా, సరస్సు, ఆనకట్ట, జలాశయం లేదా చెరువు ఉపరితలంపై ఏర్పాటు చేయబడిన సౌర విద్యుత్ ప్లాంట్లు. దీనివల్ల భూమి అవసరం తగ్గి, అందుబాటులో ఉన్న నీటి వనరులను మెరుగ్గా ఉపయోగించుకోవడానికి వీలవుతుంది.

## ప్రతి మెగావాట్‌కు రూ.1 కోటి

విజయవంతమైన ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులకు ప్రతి మెగావాట్‌కు రూ.1 కోటి వరకు కేంద్ర ఆర్థిక సహాయం లభిస్తుంది. దీంతో ప్రాజెక్టు వ్యయం తగ్గి పెట్టుబడిదారులకు ప్రోత్సాహం లభిస్తుంది. ప్రాజెక్ట్ ప్రాథమిక రీసెర్చ్, సర్వే కోసం రూ. 50 లక్షల వరకు సహాయం అందించబడుతుంది.

## దేశానికి కలిగే ప్రయోజనం ఏమిటి?

ఇండియా ప్రస్తుత ఫ్లోటింగ్ సోలార్ సామర్థ్యం సుమారు 700 మెగావాట్లుగా ఉంది. కొత్త పథకం దీనిని 5,000 మెగావాట్ల మేర పెంచుతుంది. భూసేకరణ అవసరం తగ్గుతుంది. బ్యాటరీ నిల్వ విద్యుత్ సరఫరాను మరింత స్థిరంగా, నమ్మదగినదిగా చేస్తుంది. జలాశయాలు, చెరువులు మరింత మెరుగ్గా ఉపయోగించబడతాయి. ఉపాధి, పర్యావరణం కూడా ప్రయోజనం పొందుతాయి ప్రభుత్వం ప్రకారం ఈ పథకం ద్వారా ఏటా సుమారు 10 మిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని అంచనా. ఇది సౌర ప్రాజెక్టులకు సంబంధించిన రంగాలలో 16,000 నుంచి 17,000 ఉద్యోగాలను కూడా సృష్టించగలదు. అంతేకాకుండా ఇది సోలార్ మాడ్యూల్స్, బ్యాటరీలు, ఇతర భాగాల దేశీయ తయారీని ప్రోత్సహిస్తుంది.

# పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు టామ్‌కాందే బాధ్యత

చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. జర్మనీ, జపనీస్, కొరియన్, చైనీస్, రష్యన్ తదితర భాషలు నేర్చుకునేందుకు వీలుగా స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలన్నారు. విదేశీ భాషలు నేర్పేందుకు స్థానికంగా ఆ భాషలో పట్టున్న వారితో పాటు ఆయా దేశాలకు చెందిన శిక్షకులను రప్పించాలని సీఎం అన్నారు.

యూనివర్సిటీ ప్రాంగణంలో రీలొకేటెడ్ చెట్లను నాటాలని సీఎం సూచించారు. ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చినట్లే, బ్లూ కాలర్ జాబ్‌లకు శిక్షణ పొందేవారందరికీ స్కాలర్‌షిప్‌లు ఇచ్చే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## ఏటీసీల్లో ఈవీ సర్వీసులకు సేవలు

ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు, ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఓ వైపు చదువుకుంటూనే, మరో వైపు ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా వారికి స్టైఫండ్ లభిస్తుందని, భవిష్యత్‌లో చేయబోయే ఉద్యోగానికి సంబంధించిన నైపుణ్యాలు నేర్చుకుంటారన్నారు. ఏటీసీల్లో ఈవీ సర్వీసులకు సంబంధించిన కోర్సులు, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెట్టాలని సీఎం సూచించారు. ఈవీల వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో వాటి సర్వీసింగ్ చేయగలిగిన వారు అవసరమన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం భారీగా పెరుగుతున్నందున డ్రోన్ టెక్నాలజీ కోర్సు ఉండాలని సీఎం రేవంత రెడ్డి సూచించారు.

## విదేశాల్లోనూ నర్సులకు భారీ డిమాండ్

దేశీయంగానూ, విదేశాల్లోనూ నర్సుల సేవలకు భారీ డిమాండ్ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పలు అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండడంతో ఇంటికో నర్సు డిమాండ్ ఉందన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నర్సింగ్ కళాశాలలకు అనుమతులు ఇస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, శక్తి కార్యదర్శి హరిచందన, ఉపాధి, శిక్షణ డైరెక్టర్ నిర్మలా కాంతి వెస్లీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం సురక్షితం

ఉన్న అపార అవకాశాలను వివరిస్తూ, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, “నాయకులు, పార్టీలు మారవచ్చు కానీ, గత ప్రభుత్వాలు చేపట్టిన మంచి పనులను మేం కొనసాగిస్తాం” అని స్పష్టం చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు హయాంలో బిల్ గేట్స్, బిల్ క్లింటన్ వంటి అంతర్జాతీయ ప్రముఖులను హైదరాబాద్‌కు రప్పించి పెట్టుబడులను ఆకర్షించిన తీరును ఆయన గుర్తుచేశారు.

కాంగ్రెస్ హయాంలోనే అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వంటి ప్రాజెక్టులు సాకారమయ్యాయని తద్వారా ఫార్మా ఐటీ రంగాలు మరింత విస్తరించాయని తెలిపారు. తమ పోటీ పొరుగు రాష్ట్రాలతో కాదని, తయారీ రంగంలో చైనా, జపాన్, జర్మనీ వంటి దేశాలతో పోటీ పడుతున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నగరాల పరంగా టోక్యో, న్యూయార్క్ వంటి అంతర్జాతీయ నగరాలతో పోటీ పడుతున్నామని ఆయన అన్నారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. కేంద్రం ప్రకటించిన ఏడు బుల్లెట్ రైలు ప్రాజెక్టుల్లో మూడు (శంషాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరు) తెలంగాణకు రానున్నాయని వెల్లడించారు.

రాష్ట్రానికి పెట్టుబడులు భారీగా తరలివస్తున్నాయని, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటుకు సుమారు 200 కంపెనీలు ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు. డేటా సెంటర్ల స్థాపన కోసం అమెజాన్ సంస్థ రూ.1 లక్ష కోట్లు, అదానీ గ్రూప్ రూ.35,000 కోట్లు పెట్టుబడులు పెడుతున్నాయని వివరించారు. ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీకి ప్రపంచ ప్రఖ్యాత 500 కంపెనీలను తీసుకురావడమే తమ లక్ష్యమని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా ఏర్పాట్లు ఉండాలి

ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. విమానాశ్రయ ప్రాంగణాన్ని తెలుగు సంస్కృతి, వారసత్వ వైభవాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా, గిరిజన సంప్రదాయ నృత్యమైన ‘థింసా’ను కళ్లుచెదిరే స్థాయిలో నిర్వహించాలని సూచించారు. ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధానికి అత్యంత ఘనంగా స్వాగతం పలకాలని కూడా ఆయన స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, సంబంధిత జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ గడువు పొడిగింపు

పెంచిన కేంద్ర ఎన్నికల సంఘం.. తాజాగా మరోసారి ఆగస్ట్ 10వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తిస్థాయిలో ముగియకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం విడుదల చేసిన వివరాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 77.12 శాతం ఎన్యూమరేషన్ పూర్తి అయిందని తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా చూస్తే హైదరాబాద్‌లో 56.31 శాతం, రంగారెడ్డి జిల్లాలో 63.43 శాతం, మేడ్చల్-మల్కాజిగిరిలో 61.37 శాతం మాత్రమే ప్రక్రియ పూర్తి అయింది. ఇంకా గణనీయ సంఖ్యలో ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించాల్సి ఉండటంతో గడువు పెంపు అవసరమైంది.ఇక ఎస్ఐఆర్ గడువు పొడిగింపుతో ఎన్నికల షెడ్యూల్‌లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. ఆగస్ట్ 10వ తేదీ వరకు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ కొనసాగనుండగా అదే రోజు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు. ఆ తర్వాత ఆగస్ట్ 10వ తేదీ నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన చేపట్టనున్నారు. అన్ని అభ్యంతరాల పరిష్కారం అనంతరం అక్టోబర్ 12వ తేదీన తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించనుంది. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల నుంచి ఎన్యూమరేషన్ ఫారాలు స్వీకరిస్తున్నారు. ఆ తర్వాత వాటిని ఎన్నికల సంఘం అధికారిక పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు ఆగస్టు 10వ తేదీ లోపు తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఎన్నికల అధికారులు కోరుతున్నారు.

# పోటెత్తుతున్న గోదావరి

నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు, తెలంగాణలోని ప్రధాన జలాశయాలన్నీ వరద నీటితో నిండుకుండలా మారాయి. కడెం ప్రాజెక్టు నీటిమట్టం 698.02 అడుగులకు (పూర్తి స్థాయి 700 అడుగులు) చేరగా, 10,282 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదవుతోంది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి 70 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా, నీటిమట్టం 1069 అడుగుల వద్ద ఉంది. ఇక శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 148 మీటర్లు కాగా, ప్రస్తుతం 147.30 మీటర్లకు చేరుకుంది. ఎల్లంపల్లిలోకి 1,32,785 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండటంతో, అంతే మొత్తంలో (1,32,785 క్యూసెక్కులు) నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే మిడ్ మానేరు ప్రాజెక్టులోకి 18,445 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతోంది. జలాశయాల నీటిమట్టం వేగంగా పెరుగుతుండటంతో ప్రాజెక్టుల వద్ద యంత్రాంగం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోంది.

# అశ్రునయనాల మధ్య ‘పెద్ది’ అంత్యక్రియలు పూర్తి

అర్పించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి గురువారం అర్ధరాత్రి 12 గంటల 51 నిమిషాలకు తుది శ్వాస విడిచినట్లు యశోద ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. పెద్ది మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

## ఐదురోజులు మృత్యువుతో పోరాడి

‘పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరు’ అనే వార్త బీఆర్ఎస్ శ్రేణుల గుండె బరువెక్కిస్తుంది. ఈ నెల 26న ఉదయం హనుమకొండలో ఆయనకు ఛాతీలో నొప్పి రావటంతో స్థానికంగా రోహిణి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు కార్డియాక్ అరెస్ట్‌గా గుర్తించారు. గంట సేపు శ్రమించి తొమ్మిదిసార్లు సీపీఆర్ చేశాక కొంత ఫలితం కనిపించడంతో మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. 5 రోజులు మృత్యువుతో పోరాడిన పెద్ది సుదర్శన్ రెడ్డి శుక్రవారం కన్నుమూశారు. పెద్ది మరణంతో ఆయన కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలు ఆస్పత్రికి చేరుకున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి భౌతిక కాయానికి నివాళి అర్పించారు. పెద్ది భౌతిక కాయాన్ని హనుమకొండకు తరలించారు. సుదర్శన్ రెడ్డికి భార్య స్వప్న, పిల్లలు నిదర్శన్ రెడ్డి, ధర్మిష్ట ఉన్నారు.

## అంచెలంచెలుగా ఎదిగిన పెద్ది

1974 ఆగస్టు 6న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లిలో రైతు కుటుంబంలో జన్మించిన సుదర్శన్ రెడ్డి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆయన, 2014లో నర్సంపేట నుంచి బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాతే పెళ్లి చేసుకుంటానని ప్రతిజ్ఞ చేసి రాష్ట్రం సిద్ధించిన తరువాతే 2017లో లక్ష్మీ ప్రసన్న(స్వప్న)ను వివాహమాడారు. 2016లో తెలంగాణ సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పని చేశారు. 2018లో నర్సంపేట నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2023లో ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చవి చూశారు.

# ఫార్ములా ఈ-రేసు కేసులో ఏసీబీ కోర్టుకు కేటీఆర్

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్ సీజన్-10కు సంబంధించి ఆర్థిక అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని ఏసీబీ అభియోగాలు నమోదు చేశారు. కేబినెట్, ఆర్థిక, న్యాయ శాఖల ముందస్తు అనుమతులు లేకుండానే యూకేకు చెందిన ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థకు హెచ్ఎండీఏ ద్వారా రూ.55 కోట్లకు పైగా నిధులను నిబంధనలకు విరుద్ధంగా విదేశాలకు మళ్లించారనేది ప్రధాన ఆరోపణ. ఈ వ్యవహారంలో దాదాపు 77 పేజీల విస్తృత ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసిన ఏసీబీ, 14 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసి ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిందని పేర్కొంది. ఏసీబీ మోపిన అభియోగాలను కేటీఆర్, బీఆర్ఎస్ వర్గాలు తీవ్రంగా ఖండించాయి. హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ క్రీడా, ఆటోమొబైల్ హబ్‌గా నిలబెట్టేందుకే సమిష్టిగా ఈ నిర్ణయం తీసుకున్నామని, ఇందులో ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనాలు లేదా నిధుల దుర్వినియోగం లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం కావాలనే రాజకీయ కక్షసాధింపులో భాగంగానే తమపై తప్పుడు కేసులు బనాయించిందని ఆయన మండిపడ్డారు. కుట్రపూరిత కేసులు తమ పోరాటాన్ని ఆపలేవని, న్యాయస్థానాలపై తమకు పూర్తి నమ్మకం ఉందని, అంతిమంగా సత్యమే గెలుస్తుందని ఆయన సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. కోర్టులో విచారణ ప్రక్రియ ముగిసిన అనంతరం కేటీఆర్ నాంపల్లి కాంప్లెక్స్ నుండి వెళ్లిపోయారు. ఈ విచారణ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నాంపల్లి ఏసీబీ కోర్టు ప్రాంగణంలో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. విచారణను ఆగస్టు 25కు వాయిదా వేయడంతో, ఆ రోజు కోర్టు ఏ రకమైన ఆదేశాలు ఇస్తుందనేది తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తికరంగా మారింది.

# పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులకు ఆత్మీయ వీడ్కోలు



సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, పదవి వీరమణ పొందడం అభినందనీయం.బాధితులకు తక్షణ న్యాయం, సహాయం అందించే అధికారం, సమాజాన్ని చదివే, ప్రజలకు నేరుగా సేవ చేసే అద్భుత అవకాశం ఒక్క పోలీస్ శాఖలోనే లభిస్తుంది.పోలీసు డిపార్ట్మెంట్లో నిరంతర ఆందోళన, భయాలు మరియు అనేక సవాళ్లు ఉంటాయి, ఎన్ని ఉన్నా, ఒక మంచి పని చేసి బాధితుడికి న్యాయం చేసినప్పుడు వచ్చే ఆత్మసంతోషం మరెక్కడా లభించదు..... పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఎన్.టి.ఆర్.జిల్లా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి, కర్తవ్య నిర్వహణలో చిత్తశుద్ధి, అంకిత భావంతో పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలందించి ది.31.07.2026 తేదిన పదవీ విరమణ చేస్తున్న (10) పది మంది పోలీస్ అధికారులకు ఈ రోజు పోలీస్ కమిషనర్ వారి కార్యాలయం నందు పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు , ఇతర పోలీస్ అధికారులతో కలిసి సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించినందుకు గాను పదవీ విరమణ చేసిన అధికారులను అభినందించి పోలీస్ మర్యాదలతో శాలువాలతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికినారు.

# హైదరాబాద్ పరిధిలో అర్హులైన వారికి రూ.40 లక్షల ఆస్తి

ఇప్పటికే ప్రారంభమైందని, అది పూర్తికాగానే పనులు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.హైదరాబాద్ నగరంలోని క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 500 చొప్పున మొత్తం 8 వేల ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే ఈ 16 నియోజకవర్గాలతో పాటు మరో నాలుగు నియోజకవర్గాల్లో కూడా స్థలాల గుర్తింపు పూర్తయిందని, దశలవారీగా మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణాన్ని విస్తరిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు.

## ఒక్కో ప్లాట్ విలువ రూ.40 నుంచి రూ.60 లక్షలు

పేద కుటుంబాలు కూడా హైదరాబాద్‌లోని అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గౌరవప్రదమైన జీవితం గడపాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వస్తే కొన్ని రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేసినప్పటికీ ప్రజలు వాటిని నమ్మలేదని, ప్రస్తుతం భారీగా వస్తున్న దరఖాస్తులే ఇందిరమ్మ టవర్స్‌పై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రభుత్వానికి చెందిన వందల కోట్ల రూపాయల విలువైన భూముల్లో టవర్స్ నిర్మించి, ప్రతి లబ్ధిదారునికి 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్‌ను ఉచితంగా వారి పేరుమీద రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. భూమి విలువతో కలిపి ఒక్కో ఫ్లాట్ మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

## ఆగస్టు 10 లోపు దరఖాస్తు చేసుకోవాలి

పేదల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇళ్ల కేటాయింపు, నిర్మాణం చేపడుతున్నామని, అందువల్ల ఏ నియోజకవర్గానికి చెందిన వారు ఆ నియోజకవర్గంలోనే దరఖాస్తు చేసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. దరఖాస్తుదారులు నివాస ధృవీకరణ కోసం ఆధార్ కార్డు మాత్రమే కాకుండా ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ వంటి పత్రాలను కూడా సమర్పించవచ్చని మంత్రి తెలిపారు. దీంతో ప్రజలు అనవసర ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.దరఖాస్తుల గడువును ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించే ఆలోచన లేదని, ఆగస్టు 10లోపు తప్పనిసరిగా దరఖాస్తులు పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

## యూపీఐ ద్వారా రూ.10వేలు చెల్లించాలి

ఇంటి కోసం చెల్లించే రూ.10 వేల ఈఎండీ విషయంలో ఎలాంటి అపోహలకు గురికావద్దని, అర్హత లభించని వారికి వంద శాతం మొత్తం తిరిగి చెల్లిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోసారి స్పష్టం చేశారు. యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఈఎండీ చెల్లిస్తే, అదే బ్యాంకు ఖాతాకు నేరుగా రీఫండ్ జమ అవుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల విషయంలో పారదర్శకత, బాధ్యతతో ముందుకు సాగుతుందని, ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజలకు మేలు జరిగేలా, దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తోందన్నారు. ఎవరి పట్లా కక్షపూరిత వైఖరి లేకుండా, సామాన్య ప్రజలు హర్షించే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలనే ప్రభుత్వం చేపడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# ఇంటింటికీ టీడీపీ’ కార్యక్రమానికి విశేష స్పందన

కార్యకర్తలు గడిచిన ఐదు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల కుటుంబాలను నేరుగా కలిశారు. రెండేళ్ల పాలనలో ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ కార్యక్రమం కింద శుక్రవారం ఒక్కరోజే కూటమి శ్రేణులు సుమారు 2.80 లక్షల ఇళ్లను సందర్శించాయి. ఇంటింటికీ వెళ్తున్న నేతలు, కార్యకర్తలు ముఖ్యంగా రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, మౌలిక సదుపాయాల కల్పన వంటి కీలక అంశాలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజలకు వివరిస్తున్నారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా పంచుకుంటున్నారని టీడీపీ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో పాటు జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారు.

## శ్రేణులను ప్రోత్సహిస్తున్న మంత్రి నారా లోకేశ్

“ఇంటింటికీ టీడీపీ” కార్యక్రమం పురోగతిని మంత్రి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. క్షేత్రస్థాయిలో చురుగ్గా పాల్గొంటూ ఉత్తమ పనితీరు కనబరుస్తున్న నాయకులు, కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. కొందరికి వ్యక్తిగతంగా ఎస్ఎంఎస్‌లు పంపుతూ, మరికొందరితో నేరుగా ఫోన్‌లో మాట్లాడి వారిలో ఉత్సాహాన్ని నింపుతున్నారు. పార్టీ శ్రేణులు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, రానున్న రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ చేరుకుని ప్రభుత్వ విజయాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా వివరించాలని లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర కీలకమని ఆయన ప్రశంసించారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తిరుపతిలో పకడ్బందీ ఏర్పాట్లు

**- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**

**- టీటీడీ జేఈవో డాక్టర్ ఎ. శరత్**



తిరుపతి(ప్రశ్న న్యూస్) తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, నవరాత్రి బ్రహ్మోత్సవాలు, పెరటాసి శనివారాల సందర్భంగా తిరుమల, తిరుపతికి భారీ సంఖ్యలో విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ జేఈవో డాక్టర్ ఎ. శరత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలోని జేఈవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.భక్తుల వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి నగరం, పరిసర ప్రాంతాల్లో తగిన పార్కింగ్ స్థలాలను సిద్ధం చేయాలని, వివిధ ప్రాంతాల్లో హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించాలని సూచించారు. పార్కింగ్ ప్రాంతాలు, హోల్డింగ్ పాయింట్ల వద్ద మొబైల్ మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యాలు కల్పించి పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.తిరుపతి నగరం, ప్రధాన కూడళ్లు, రహదారులు, భక్తులు అధికంగా సంచరించే ప్రాంతాల్లో స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించిన జేఈవో, ముఖ్య ప్రాంతాల్లో క్యూ ఆర్ కోడ్‌లతో కూడిన సూచిక బోర్డులు ఏర్పాటు చేసి దర్శనం, వసతి, రవాణా తదితర వివరాలను భక్తులు సులభంగా తెలుసుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.స్థానిక ఆలయాలు, ప్రధాన ప్రభుత్వ భవనాలు, ప్రధాన రహదారులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. అలాగే టీటీడీ ప్రజా సంబంధాల విభాగం ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, అలిపిరి బస్టాండ్, అలిపిరి నడక మార్గం, విష్ణునివాసం, శ్రీనివాసం తదితర ప్రాంతాల్లో అదనపు సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి భక్తులకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు.మహతి కళాక్షేత్రం, రామచంద్ర పుష్కరిణి, అన్నమాచార్య ప్రాజెక్టులో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. భక్తులకు అవసరమైన ప్రాంతాల్లో శ్రీవారి సేవకులను నియమించి సేవలను మరింత విస్తృతంగా అందించాలని టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ టి. రవికి సూచించారు.శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు, నవరాత్రి బ్రహ్మోత్సవాలు, పెరటాసి శనివారాల సందర్భంగా భారీ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇంజినీరింగ్ శాఖతో పాటు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి భక్తులకు అత్యుత్తమ సేవలు అందించాలని జేఈవో డాక్టర్ ఎ. శరత్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో ఎస్ఈ--1 మనోహరం, ఎస్ఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, డీఈలు రవిశంకర్ రెడ్డి, సరస్వతి, విజిలెన్స్ అధికారి గిరిధర్, అదనపు ఆరోగ్య అధికారి డాక్టర్ సునీల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఐదు రోజుల్లో 12 లక్షల ఇళ్లకు చేరిన

# 'ఇంటింటికీ టీడీపీ'

- రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్న కూటమి ప్రచార కార్యక్రమం
- పార్టీ శ్రేణులను అభినందించిన నారా లోకేష్



**అమరావతి(ప్రశ్న న్యూస్)** తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఇంటింటికీ టీడీపీ – – 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి--సంక్షేమం" కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఐదో రోజూ విజయవంతంగా కొనసాగింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు.ఐదో రోజు ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.80 లక్షల ఇళ్లను సందర్శించిన కూటమి శ్రేణులు, గత ఐదు రోజుల్లో కలిపి 12 లక్షల ఇళ్లకు చేరుకుని ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించినట్లు పార్టీ తెలిపింది. రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వివిధ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించగా, ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని పేర్కొంది.రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారని వెల్లడించింది. ప్రజలతో నేరుగా మమేకమవుతూ ప్రభుత్వ పనితీరును ఇంటింటికీ తీసుకెళ్లే లక్ష్యంతో ఈ కార్యక్రమం కొనసాగుతోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా యువనేత, మంత్రి నారా లోకేష్ పార్టీ శ్రేణుల పనితీరును అభినందించారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల్లో ఆదరణ పొందుతున్న నాయకులు, కార్యకర్తలకు వ్యక్తిగతంగా ఎస్ఎంఎస్‌ల ద్వారా అభినందనలు తెలియజేయడంతో పాటు, పలువురితో నేరుగా ఫోన్‌లో మాట్లాడి వారి సేవలను ప్రశంసించినట్లు పార్టీ వెల్లడించింది.రానున్న రోజుల్లో ఇదే ఉత్సాహంతో ప్రతి ఇంటికీ చేరుకుని కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత విస్తృతంగా వివరించాలని నారా లోకేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం


- ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక
- ప్రజా దర్బార్... 37 వినతులు స్వీకరణ



పలాస(ప్రశ్న న్యూస్) ప్రజలకు నేరుగా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వేగంగా పరిష్కరించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం "ప్రజా పరిష్కార వేదిక--ప్రజా దర్బార్" కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా పింఛన్లు, రేషన్ కార్డులు, గృహ నిర్మాణాలు, తాగునీటి సరఫరా, రహదారులు, విద్యుత్ సమస్యలు, భూ వివాదాలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 37 వినతిపత్రాలను ప్రజలు అందజేశారు. ప్రతి అర్జీని ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో వెంటనే సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండదని స్పష్టం చేసిన ఎమ్మెల్యే, ప్రతి వినతిని బాధ్యతగా పరిగణించి నిర్ణీత గడువులో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధిగా తమ ప్రధాన బాధ్యత అని అన్నారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలియజేయడం వల్ల వాటి పరిష్కారం వేగవంతమవుతుందని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.ప్రజా దర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఓటు పోతుందనే ఆందోళన అవసరం లేదు

- నమూనా జాబితాలో పేరు లేకున్నా దరఖాస్తుతో నమోదు చేసుకోవచ్చు
- ఆప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ టి. సేవ కుమార్



గుంటూరు(ప్రశ్న న్యూస్) ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా విడుదల కానున్న నమూనా ఓటర్ల జాబితాలో పేరు లేకపోయినా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ టి. సేవ కుమార్ అన్నారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఇంటింటి సర్వేలో భాగంగా బీఎల్‌వోలు ఎన్యుమరేషన్ పత్రాలను సేకరించే ప్రక్రియ ఈ నెల 24తో ముగిసిందని తెలిపారు. ఆగస్టు 1 నుంచి నమూనా ఓటర్ల జాబితా అందుబాటులోకి వస్తుందని, అందులో పేరు లేని వారు తగిన ఆధార పత్రాలతో ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకుని ఓటు నమోదు చేసుకోవచ్చని చెప్పారు.గత 24 ఏళ్లుగా మరణించిన ఓటర్లు, రెండు చోట్ల ఓటు హక్కు కలిగిన డూప్లికేట్ ఓటర్లు, ఇతర ప్రాంతాలకు బదిలీ అయినవారు, ఆచూకీ లేని ఓటర్లను ప్రత్యేక సవరణ ప్రక్రియలో గుర్తించి జాబితా నుంచి తొలగించినట్లు తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 59 వేలకుపైగా, గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 49 వేలకుపైగా ఓటర్ల పేర్లను తొలగించినట్లు పేర్కొన్నారు.ఈ ప్రక్రియ ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తిగా పారదర్శకంగా నిర్వహించబడిందని చెప్పారు. ప్రభుత్వ బీఎల్‌వోలు, రాజకీయ పార్టీల బీఎల్‌ఏల సమక్షంలోనే అర్హత లేని ఓటర్లను గుర్తించి జాబితా నుంచి తొలగించారని వివరించారు.తొలగించిన ఓట్ల సంఖ్య, గత సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ కాని ఓట్ల శాతానికి దాదాపు సమానంగా ఉందని పేర్కొన్నారు. అర్హత ఉన్నప్పటికీ పేరు తొలగించబడితే ఫారం-6 ద్వారా తిరిగి ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉందని, ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాలు లేదా రాజకీయ పార్టీల కార్యాలయాల్లో ఓటు వివరాలను ధ్రువీకరించుకోవాలని డాక్టర్ టి. సేవ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# కాలేయాన్ని కాపాడుకుందాం

## - ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం - సింహాచలం లక్ష్మణస్వామి

## - వ్యవస్థాపక అధ్యక్షులు, ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం



ప్రతి సంవత్సరం జూలై 28న ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం నిర్వహించడం వెనుక ప్రధాన ఉద్దేశ్యం కాలేయాన్ని ప్రభావితం చేసే హెపటైటిస్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడం. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం వైరల్ హెపటైటిస్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది లివర్ సిరోసిస్, కాలేయ వైఫల్యం, కాలేయ క్యాన్సర్ వంటి తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా హెపటైటిస్ బి, సి రకాలలో ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు కనిపించకపోవడం వల్ల అనేక మంది ఆలస్యంగా గుర్తిస్తున్నారు. అందుకే అవగాహన, పరిశుభ్రత, సరైన జీవనశైలి, ముందస్తు పరీక్షలు, సమయానికి వైద్య సేవలు అత్యంత అవసరం.

మన శరీరంలో కాలేయం(లివర్) ఒక అద్భుతమైన అవయవం. మనం తినే ఆహారాన్ని శక్తిగా మార్చడం, జీర్ణక్రియకు అవసరమైన పిత్తరసాన్ని తయారు చేయడం, శరీరంలోని జీవక్రియలను సమతుల్యం చేయడం, హానికర పదార్థాలను తొలగించడంలో సహకరించడం వంటి అనేక కీలక బాధ్యతలను నిర్వర్తిస్తుంది. కాలేయం ఆరోగ్యంగా ఉంటేనే శరీరం చురుకుగా ఉంటుంది. అందువల్ల కాలేయాన్ని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత.ఆయుర్వేదం ప్రకృతి ప్రసాదించిన ఔషధ సంపదకు ప్రతీక. కాలేయ ఆరోగ్య పరిరక్షణలో విశేష ప్రాధాన్యం పొందిన మూలికల్లో బృంగరాజం (గుంట గలగర) భూమ్యామలకి (నేల ఉసిరి) ముఖ్యమైనవి. శతాబ్దాలుగా ఆయుర్వేద వైద్యులు ఈ మూలికలను కాలేయాన్ని బలోపేతం చేయడానికి, కాలేయ పనితీరును మెరుగుపరచడానికి, శరీర సహజ శుద్ధి ప్రక్రియలకు తోడ్పడేందుకు ఉపయోగిస్తున్నారు. సరైన ఆయుర్వేద వైద్యుల పర్యవేక్షణలో ఈ మూలికల వినియోగం కాలేయ ఆరోగ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.మన దేశంలో వర్షాకాలం ప్రారంభమైన తర్వాత ముఖ్యంగా కలుషితమైన నీరు మరియు అపరిశుభ్రమైన ఆహారం వల్ల హెపటైటిస్ ఎ, ఈ వంటి వైరల్ వ్యాధులు వ్యాపించే అవకాశం పెరుగుతుంది. అందువల్ల ప్రతి కుటుంబం తాగునీటిని తప్పనిసరిగా మరిగించి, వడగట్టి ఉపయోగించాలి. బయట దొరికే అపరిశుభ్రమైన తినుబండారాల కంటే ఇంట్లో పరిశుభ్రంగా తయారు చేసిన ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలి. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, తగినంత నీరు తీసుకోవడం ద్వారా శరీర రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది.మద్యం సేవించడం, ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వినియోగం కాలేయంపై అనవసర భారం పెంచుతాయి. ఈ అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండడం ద్వారా కాలేయ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చు. అలాగే ప్రతిరోజూ తగినంత నిద్ర, సమయానికి ఆహారం, తేలికపాటి వ్యాయామం, యోగా, ప్రాణాయామం వంటి అలవాట్లు శరీర సమతుల్యతను కాపాడుతాయి.

పరిశుభ్రమైన పర్యావరణం కూడా ఆరోగ్యానికి మూలాధారం. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, చెత్తను సక్రమంగా నిర్వహించడం, నిల్వ నీరు లేకుండా చూడడం, ఈగలు, దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అనేక అంటువ్యాధులను నివారించవచ్చు. అదే విధంగా ప్రతి ఇంటి వద్ద కనీసం కొన్ని మొక్కలు నాటడం, గ్రామాల్లో, పట్టణాల్లో పచ్చదనాన్ని పెంచడం ద్వారా స్వచ్ఛమైన గాలి లభిస్తుంది. ప్రకృతి మనకు అందించే పరిశుభ్రమైన ఆక్సిజన్ ఆరోగ్యవంతమైన జీవితానికి అమూల్యమైన వరం.హెపటైటిస్ వంటి వ్యాధుల నివారణలో అవగాహనే మొదటి ఔషధం. పరిశుభ్రమైన నీరు, పరిశుభ్రమైన ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, అవసరమైన టీకాలు, సమయానికి వైద్య పరీక్షలు, ఆరోగ్యకరమైన జీవనశైలి---ఈ ఐదు సూత్రాలను ప్రతి కుటుంబం పాటిస్తే కాలేయాన్ని అనేక ప్రమాదాల నుంచి రక్షించుకోవచ్చు.ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక సంకల్పం చేద్దాం. ధూమపానానికి, మద్యపానానికి దూరంగా ఉండండి. పరిశుభ్రమైన నీటినే తాగండి. బయట ఆహారం తగ్గించి ఇంటి ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వండి. బృంగరాజం, నేల ఉసిరి వంటి విలువైన ఆయుర్వేద మూలికల ప్రాముఖ్యతను తెలుసుకొని ప్రకృతి వైద్య సంపదను సంరక్షించండి. ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచండి. పరిశుభ్రమైన పరిసరాలను కాపాడండి. ఆరోగ్యవంతమైన కాలేయంతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని నిర్మించుకుందాం.



పకృతిని ప్రేమిద్దాం..ఆయుర్వేదాన్ని ఆదరిద్దాం..
కాలేయాన్ని కాపాడుకుందాం..
ఆరోగ్య భారత నిర్మాణంలో మన వంతు బాధ్యతను నిర్వర్తిద్దాం..

# కూటమి పాలనలోనే ప్రజా సంక్షేమం

**రాయచోటి** కూటమిపాలనలోనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని జరుగుతోందని టిడిపి మండల క్లస్టర్ ఇంచార్జి విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు శుక్రవారం అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం లో సంబేపల్లి మండలంలోని టిడిపి ఇంటింటి ప్రచారం ముమ్మరంగా చేశారు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి నియోజకవర్గం లో మండల నాయకులు గ్రామ నాయకులు టిడిపి కార్యకర్తలు ఇంటింటి ప్రచారంతో హోలీ తీస్తున్నారు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి మంత్రి రాంప్రసాద్ రెడ్డి రాయచోటి నియోజకవర్గం లో చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు విపులంగా వివరిస్తున్నారు . వాడ వాడ గ్రామ గ్రామాన పల్లె పల్లెనా టిడిపి కార్యకర్తలు కలయి తిరుగుతూ కరపత్రాలు పంచుతూ టిడిపి ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నారు కూటమి పాలనలోనే తమకు మంచి జరుగుతోందని వచ్చే ఐదేళ్లు కూటమిపాలనే ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని క్లస్టర్ ఇంచార్జ్ వివరించారుమంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో గున్నికుంట్ల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని తెలిపారుగున్నికుంట్లలో ఉత్సాహంగా ' కార్యకర్తలు పాల్గొన్నారు. సంబేపల్లి మండలంలో ఇప్పటికే సగం గ్రామాలలో ప్రచారం పూర్తి చేశామని చెప్పారు ఏ గ్రామానికి వెళ్లిన టిడిపి కార్యకర్తలకు నాయకులకు, ప్రజల నుంచి అపూర్వ స్పందన అభిస్తోందన్నారురాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కేవలం ప్రజల మంచి కోరే ప్రభుత్వమని, ప్రతి పౌరుడి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని సంబేపల్లి మండల క్లస్టర్ ఇంచార్జి గంగిరెడ్డి గారి విష్ణువర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.రాష్ట్ర మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి, మరియు యువనాయకులు మౌర్యా రెడ్డి గారి ఆదేశాల మేరకు.. సంబేపల్లి మండలం గున్నికుంట్ల గ్రామంలో స్థానిక నేతలతో కలిసి ఆయన



'డోర్ టు డోర్' (ఇంటింటి ప్రచారం) కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో గున్నికుంట్ల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని సత్వరమే పరిష్కరించాలన్నదే మంత్రి గారి లక్ష్యమని పేర్కొన్నారు. డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి, మౌర్యా రెడ్డిల మార్గదర్శకత్వంలో గ్రామంలోని మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు.గత ప్రభుత్వ వైఫల్యాలను, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రజల నుండి వస్తున్న సానుకూల స్పందన పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఈ డోర్ టు డోర్ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కూటమి పార్టీల కార్యకర్తలు, మరియు గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సిద్ధారెడ్డి . సర్పంచ్, బలరాం . శ్రీకాంత్ రెడ్డి,రెడ్డి శేఖర్ రెడ్డి, సుబ్బయ్య యోగాజలు రెడ్డి, వెంకటరమణ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, వెంకటరమణ రెడ్డి, రంగారెడ్డి, రామ రాజు, అచ్చిరాజు, భరత్ రెడ్డి, శ్రీనివాసులు, రెడ్డి శేఖర్. పెద్ద రెడ్డెయ్య, ఆనంద్, రెడ్డప రెడ్డి అర్జునరాజు, పవన్ కుమార్ రెడ్డి, విజయ భాస్కర రాజు,పెద్ద నరసింహ రెడ్డి, సుధీర్, విజయ్, వీరప్రతాప్, కార్తీక్, బాలు,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక నెల-ఒక నియోజకవర్గం-నాలుగు పర్యటనలు" కార్యక్రమం

- గోనెగండ్ల మండలంలో సమస్యల వినతుల స్వీకరణ
- రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

**గోనెగండ్ల** ప్రజల సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించి మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి శుక్రవారం"ఒక నెల-ఒక నియోజకవర్గం-నాలుగు పర్యటనలు" కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. "ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు" లో భాగంగా శుక్రవారం ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గోనెగండ్ల మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, ఎమ్మెల్యే బి.వి. జయ నాగేశ్వరరెడ్డి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఆర్ఓ వెంకటనారాయణమ్మ, జిల్లా స్థాయి అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ఎమ్మిగనూరు నియోజకవర్గంలో గోనెగండ్ల మండలంలో ఒక నెలపాటు ప్రతి శుక్రవారం 4 మార్లు నియోజకవర్గంలో పర్యటించి ప్రజల వినతులను స్వీకరించి వాటి పరిష్కారంపై ప్రత్యక్షంగా సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు సమర్పించే వినతుల్లో అక్కడికక్కడే పరిష్కరించే అవకాశం ఉన్న వాటిని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. మిగిలిన వినతులపై నిర్ణీత గడువులో చర్యలు చేపట్టి, వాటి పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ప్రత్యేకత ఏమిటంటే, ప్రతి శుక్రవారం స్వీకరించిన వినతులపై తదుపరి శుక్రవారం సమగ్ర సమీక్ష నిర్వహించి, సమస్య పరిష్కారమైనదా, పెండింగ్‌లో ఉందా, పెండింగ్‌కు గల కారణాలు ఏమిటి, ఎప్పటిలోగా పరిష్కారం అందించగలమనే అంశాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు . ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలకు వచ్చే వినతుల్లో అత్యధికంగా 22-ఏ నిషేధిత జాబితా నుండి భూముల తొలగింపు, రీ-సర్వే అనంతరం తలెత్తిన భూ వివాదాలు, ఇనాం భూముల నమోదు, పట్టా భూముల సమస్యలు, భూ విస్తీర్ణ వ్యత్యాసాలు వంటి అంశాలపై ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ త్వరితగతిన చర్యలు చేపడతామని తెలిపారు. అదేవిధంగా రహదారుల నిర్మాణం, బస్సు సౌకర్యం, బస్ హాల్ట్‌లు, రైల్వే హాల్ట్‌లు, వ్యవసాయ భూములకు దారి, తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక వసతులు, సంక్షేమ పథకాలకు సంబంధించిన వినతులు కూడా ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు అవసరమైన భూ రికార్డులు, ఇతర పత్రాలతో సిద్ధంగా ఉండడం వల్ల ప్రజలు తెలియజేసిన సమస్యలను వెంటనే పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించి సాధ్యమైనంత మేరకు అక్కడికక్కడే పరిష్కారం అందించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజలు క్రమశిక్షణతో వినతులు సమర్పించి అధికారులకు సహకరించాలని కోరిన జిల్లా కలెక్టర్, ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి ప్రజలకు న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటనారాయణమ్మ, ఆదోని ఆర్డీవో అరుణాదేవి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లయ్య,ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సురేష్, డ్వామా పిడి నరసింహారెడ్డి, డిపిఓ భాస్కర్, డిఆర్డిఏ పిడి శ్రీధర్,ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ మనోహర్,ఐ సి డి ఎస్ పి డి విజయ తదితరులు పాల్గొన్నారు.

# కరకపట్లలో భారీ పోలీసు కార్డన్ సెర్చ్

**32 బైకులు, 29 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం - ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యం - ఏసీపీ నరసింహులు**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) మర్కుక్ మండలంలోని కరకపట్ల గ్రామంలో శుక్రవారం గజ్వేల్ ఏసీపీ నరసింహులు ఆధ్వర్యంలో భారీ పోలీసు బలగాలతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీలు విస్తృతంగా సాగాయి. ఈ ఆపరేషన్‌లో గజ్వేల్ ఏసీపీతో పాటు ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్ఐలు, 111 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం బలగాలను 9 ప్రత్యేక బృందాలుగా విభజించి గ్రామంలోని ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

### - తనిఖీల్లో స్వాధీనంసరైన పత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలు

బెల్ట్ షాపుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 29 లీటర్ల మద్యం
స్వాధీనం చేసుకున్న వాహనాలు, మద్యానికి సంబంధించి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ నరసింహులు మాట్లాడుతూ, గుర్తుతెలియని లేదా అనుమానాస్పద వ్యక్తులకు పూర్తి వివరాలు, గుర్తింపు పత్రాలు పరిశీలించకుండా ఇళ్లను అద్దెకు ఇవ్వొద్దని ప్రజలకు సూచించారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, గ్రామంలో ఎక్కడైనా అక్రమ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే గ్రామాల్లో భద్రతను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి వీధి, కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, వాహన పత్రాలతోనే ప్రయాణిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే నేర రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్న ఏసీపీ, గ్రామంలో శాంతియుత వాతావరణం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్డన్ సెర్చ్‌లో గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు, తొగుట సీఐ లతీఫ్, మర్కుక్ ఎస్ఐ యూనిస్‌తో పాటు గజ్వేల్ డివిజన్‌కు చెందిన పలువురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రకు భోగాపురం 'గేమ్ ఛేంజర్'

**అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ**
**విమానాశ్రయంతో మారనున్న రూపురేఖలు**
**రూ.17,900 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం..**
**మూడు లక్షల మందికి తగ్గకుండా**
**హాజరు లక్ష్యం: మంత్రి కొలుసు పార్థసారథి**



భోగాపురం(ప్రశ్న న్యూస్) అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి కొత్త దశలోకి అడుగుపెట్టనుందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్రకు గేమ్ ఛేంజర్‌గా నిలిచి ఈ ప్రాంత ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక రంగాలకు కొత్త ఊపునిస్తుందని పేర్కొన్నారు. శుక్రవారం భోగాపురం విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడిన మంత్రి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ప్రజల సంక్షేమం, ఉపాధి, రవాణా, పర్యాటకం, పారిశ్రామికాభివృద్ధికి దోహదపడే పలు కీలక ప్రాజెక్టులకు త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు.

### మూడు లక్షల మందికి ఏర్పాట్లు

భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి మూడు లక్షలకు పైగా ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని మంత్రి తెలిపారు. ప్రజల రాకపోకల కోసం 5 నుంచి 6 వేల బస్సులను సిద్ధం చేసినట్లు, ప్రజాప్రతినిధులు కూడా అదనంగా మినీ బస్సులు, ఇతర వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

### రూ.17,900 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా రూ.17,900 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం జరగనుందని మంత్రి తెలిపారు.
కార్యక్రమ ఏర్పాట్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ప్రతిరోజూ సమీక్షిస్తూ అధికారులకు అవసరమైన సూచనలు చేస్తున్నారని చెప్పారు. దీంతో పారిశ్రామిక, వాణిజ్య రంగాలు వేగంగా అభివృద్ధి చెందడంతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత విస్తరిస్తాయని అన్నారు. ఇప్పటివరకు వలసలకు పేరుగాంచిన ఉత్తరాంధ్ర, భవిష్యత్తులో ఇతర ప్రాంతాల వారికి కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### పోలవరం నీరు ఉత్తరాంధ్రకు

ఆగస్టు 14న పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు నీటిని విడుదల చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. సాగు, తాగునీరు, పరిశ్రమలకు ఇది ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవం చిరస్మరణీయ ఘట్టంగా నిలిచేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని మంత్రి తెలిపారు. సమావేశంలో సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

## లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి ఆలయంలో శిఖర పూజ, ధ్వజారోహణ.. పాల్గొన్న నగర సీపీ వీసీ సజ్జనర్‌లాల్

దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి దేవాలయంలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన శిఖర పూజ, ధ్వజారోహణ కార్యక్రమాల్లో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా బోనాల సందర్భంగా హైదరాబాద్ సీపీని ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది. నగర సీపీ సజ్జనర్ మాట్లాడుతూ లాల్‌దర్వాజా ఆలయ ఘనమైన చరిత్రను గుర్తు చేస్తూ.. గత 120 సంవత్సరాలుగా ఆషాఢ మాసంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోందని వివరించారు. ఇప్పటికే గోల్కొండ, బల్కంపేట బోనాల ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యాయని ఆయన తెలిపారు.

## 'పరామర్శ పేరుతో ఉత్తరాంధ్రలో
# అలజడి సృష్టించే కుట్ర'

**జగన్ పర్యటనపై టీడీపీ--జనసేన నేతల విమర్శలు**
**మహిళా పోలీసు అధికారిపై దాడిని ఖండించిన నాయకులు**




మంగళగిరి(ప్రశ్న న్యూస్) మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర పర్యటనపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఏపీ ఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ మంత్రి సిదిరి అప్పలరాజును పరామర్శించడానికే ఉత్తరాంధ్రకు వెళ్లినట్లు చెప్పిన జగన్, ఆ లక్ష్యాన్ని నెరవేర్చలేదని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భోగాపురం పర్యటనకు ముందు ఉత్తరాంధ్రలో ఉద్రిక్త పరిస్థితులు సృష్టించాలనే ఉద్దేశంతోనే ఈ పర్యటన చేపట్టారని వారు ఆరోపించారు. మహిళా పోలీసు అధికారి ప్రవళికపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించిన నేతలు, విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసు అధికారిపై దౌర్జన్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టప్రకారం కఠిన శిక్షలు అమలు చేయాలని అన్నారు. 'వైసీపీ నేరస్థులను ప్రోత్సహిస్తోంది' పలు కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తులకు వైసీపీ మద్దతు ఇస్తోందని చిల్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. మహిళా పోలీసు అధికారిపై జరిగిన ఘటనపై జగన్ స్పందించకపోవడం ప్రశ్నార్థకమన్నారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీల పట్ల వైసీపీకి నిజమైన చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. రాష్ట్రంలో నేరాలకు పాల్పడిన వారిని సమర్థించే రాజకీయాలను ప్రజలు అంగీకరించరని, రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన తీర్పు ఇస్తారని ఇద్దరు నేతలు పేర్కొన్నారు.

# కళాకారుల కళ్లకు ఆరోగ్య భరోసా

**అత్తిలిలో లేస్, నేత కళాకారులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం**
**15 మందికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు**



అత్తిలి(ప్రశ్న న్యూస్) హస్తకళాకారుల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు హస్తకళాకారుల కోసం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా అత్తిలిలో లేస్, నేత కళాకారులకు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం సందర్భంగా కళాకారులకు ఇచ్చిన హామీ మేరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కొండపల్లి, నరసాపురం, పాలకొల్లు, బొబ్బిలి, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించి కళాకారులకు ఆరోగ్య సేవలు అందించినట్లు వెల్లడించారు. అత్తిలిలో నిర్వహించిన శిబిరంలో మొత్తం 143 మంది హస్తకళాకారులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. వారిలో 15 మందికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించగా, వారికి త్వరలోనే ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 110 మందికి కళ్లద్దాలు అవసరమని నిర్ధారించగా, వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించనున్నారు. మరో 18 మందికి అవసరమైన మందులను అక్కడికక్కడే ఉచితంగా పంపిణీ చేశారు. హస్తకళాకారుల చేతుల్లో కళ చిరకాలం నిలవాలంటే వారి ఆరోగ్యానికి, ముఖ్యంగా కంటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అధికారులు తెలిపారు. కంటి పరీక్షల నుంచి కళ్లద్దాలు, మందులు, అవసరమైన శస్త్రచికిత్సల వరకు పూర్తిస్థాయి వైద్య సేవలను ఉచితంగా అందిస్తూ కళాకారులకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఏపీలో ముసాయిదా ఓటర్ల
# జాబితా విడుదల

## – తగ్గిన ఓటర్లు

**విజయవాడ,** ఏపీలో ఓటర్ల జాబితాలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) అనంతరం దాదాపు 45 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగిస్తూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఈరోజు ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వారి పేర్లను ఈ జాబితా నుంచి తొలగించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) వివేక్ యాదవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తొలగించిన ఓట్లలో శాశ్వతంగా చిరునామా మారిన లేదా అందుబాటులో లేని వారు 22.30 లక్షల మంది ఉన్నారు. మరణించిన వారివి 15.22 లక్షల ఓట్లు కాగా, రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు నమోదు చేసుకున్న 7.37 లక్షల మంది ఓట్లను కూడా తొలగించారు. ఈ సవరణ ప్రక్రియను జూన్ 15 నుంచి జూలై 24 వరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పకడ్బందీగా నిర్వహించారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలోని మొత్తం 4,16,27,694 మంది ఓటర్లకు గాను 3.71 కోట్ల మంది (89.22%) నుంచి బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించారు. మిగిలిన 44.89 లక్షల మంది ఓటర్లు వారి చిరునామాలో అందుబాటులో లేకపోవడం, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం, ఫారాలు సమర్పించకపోవడం లేదా ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఇష్టపడకపోవడం వంటి కారణాల వల్ల వారి వివరాలను సేకరించలేకపోయినట్లు సీఈఓ వివరించారు. అయితే, జాబితా నుంచి పేర్లు తొలగిపోయిన అర్హులైన ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. అలాంటి వారు తమ ఓటు హక్కును తిరిగి పొందేందుకు అవకాశం కల్పించారు. ఇవాళ్టి నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తారు. అర్హులైన వారు నిర్దేశిత డిక్లరేషన్ ఫారంతో పాటు ఫారం-6ను సమర్పించి, తమ పేరును తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చుకోవచ్చు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు ఉన్న వారి పేరును వారు కోరుకున్న ఒక్క చోట మాత్రమే ఉంచుతారు. ప్రజల సౌలభ్యం కోసం తొలగించిన ఓటర్ల జాబితాను రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఈఆర్ఓ/ఏఈఆర్ఓ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల నోటీస్ బోర్డులపై ప్రదర్శనకు ఉంచారు. అలాగే, సీఈఓ, జిల్లా ఎన్నికల అధికారుల వెబ్‌సైట్లలో కూడా ఈ జాబితాలు అందుబాటులో ఉన్నాయి. వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు పరిష్కరించి, అక్టోబర్ 3న ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తామని వివేక్ యాదవ్ తెలిపారు. ఈ భారీ ప్రక్రియలో జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, 46,397 మంది బీఎల్ఓలు సమన్వయంతో పనిచేశారని ఆయన అభినందించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు కూడా ఈ ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్నాయని, గతంలో 68,868 మంది బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ) ఉండగా, ఇప్పుడు వారి సంఖ్య 1,27,868కి పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

# వర్షం కొరకు ఎదురుచూస్తున్న రైతన్నలు

**మండల కేంద్రంలో వర్షం కోసం భజనలు నిర్వహణ.**



**తుగ్గలి:** సరైన వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన మంచి వర్షాలు కురవాలని గ్రామ దేవతలకు నిండు బిందెలతో నీళ్ళుపోసి పూజలు చేస్తున్నారు. శివాలయాలలోని శివలింగం మునిగిపోయేవరకు నీళ్ళుపోసి శివలింగాన్ని జల దిగ్బంధం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామాలలో భక్తి గీతాలతో భజనలు చేస్తున్నారు. ఐనా వానలు కురవడం లేదు. కొందరు గండా దీపం వెలిగించుకుని భజనలు చేసుకుంటూ గ్రామంలో తిరుగుతున్నారు. మండల కేంద్రమైన తుగ్గలి గ్రామంలో రైతులు, భక్తులు వర్షం కోసం భజనలు చేస్తున్నారు. గండా దీపం వెలిగించుకొని, భజనలు చేస్తూ ఇంటింటికి తిరుగుతున్నారు. గృహస్థులు గండా దీపంకి నీళ్ళుపోసి, పసుపు కుంకుమ పెట్టి వర్షాలు కురవాలని మొక్కుతున్నారు. భజనలు చేస్తూ గ్రామంలోని ప్రతి ఇంటికి గండా దీపంతొ వెళ్తామని భజన బృందం సభ్యులు తెలిపారు.

# సున్నిపెంటలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన




**శ్రీశైలం** శ్రీశైలం ప్రాజెక్టులో ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని సానుకూల దృక్పథంతో పరిశీలించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిర్ణీత గడువులోగా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. 'వన్ మంత్ - ఫోర్ విజిట్' కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం నియోజకవర్గంలోని సున్నిపెంట రెడ్డివారి కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌లు, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. అందిన ప్రతి అర్జీని స్వయంగా పరిశీలిస్తూ సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ×ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, వారి సమస్యలను నేరుగా తెలుసుకొని వేగవంతంగా పరిష్కరించడమే 'వన్ మంత్ - ఫోర్ విజిట్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇప్పటికే శ్రీశైలం నియోజకవర్గంలో ఆత్మకూరు, మహానంది, వెలుగోడు మండలాలలో 900కు పైగా అర్జీలు స్వీకరించామని, వాటిలో అత్యధికంగా రెవెన్యూ, సంక్షేమం తదితర శాఖలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి అర్జీపై అధికారులు బాధ్యతాయుతంగా స్పందించాలని, అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్య వాస్తవ పరిస్థితిని తెలుసుకున్న అనంతరమే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారమైన వెంటనే సంబంధిత ఉత్తర్వులు లేదా చర్యల ప్రతిని అర్జీదారునికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో స్వీకరించిన అన్ని వినతులను కలెక్టరేట్ బృందం డిజిటలైజ్ చేసి వెంటనే సంబంధిత శాఖలకు పంపించి నిరంతర పర్యవేక్షణ చేపడుతుందని తెలిపారు. సున్నిపెంట ప్రాంతంలో అధికంగా ఇళ్ల స్థలాలు, గృహాలు, పెన్షన్లు, విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, ప్రాథమిక వసతులకు సంబంధించిన సమస్యలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఇళ్ల స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను అర్హతల మేరకు పరిశీలించి, స్థలం మాత్రమే కోరిన వారి వివరాలను వేరుగా నమోదు చేయాలని, ఇల్లు మరియు స్థలం రెండూ అవసరమైన వారి ప్రతిపాదనలను ఆర్డీఓకు పంపించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సున్నిపెంటలో కొన్ని ప్రాంతాల్లో మూడు నుంచి నాలుగు ఇళ్లకు ఒకే విద్యుత్ మీటర్ ఉండటం వల్ల పేద కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కోల్పోతున్నాయని వచ్చిన ఫిర్యాదులను ప్రస్తావిస్తూ, గతంలో కేటాయించిన గృహాల జాబితాను పరిశీలించి ప్రతి ఇంటికి ప్రత్యేక విద్యుత్ మీటర్, విద్యుత్ కనెక్షన్ కల్పించేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెస్టన్ కాలనీతో పాటు ఇతర కాలనీల్లో వీధి దీపాలు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల కొరత ఉందని ప్రజలు తెలియజేశారని, సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అడవి మృగాల సంచారం దృష్ట్యా వీధి దీపాల ఏర్పాటు అత్యవసరమని పేర్కొంటూ, విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో అంచనాలు సిద్ధం చేసి పనులు చేపట్టాలని ఆదేశించారు. సున్నిపెంట తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం రూ.15 కోట్ల వరకు నిధులు మంజూరు చేసిందని, టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా పైప్‌లైన్లు, మోటార్లు, ప్రత్యామ్నాయ నీటి వనరులను సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి చేయాలని ఆదేశించారు. రోడ్లు ఉన్న ప్రాంతాల్లో డ్రెయినేజీ సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రత్యామ్నాయ కార్యాచరణ రూపొందించి డ్రెయినేజీ నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాల ద్వారా ఇప్పటికే అనేక మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామని, త్వరలో సున్నిపెంట ప్రాంత యువతకు ఉపయోగపడేలా మరో భారీ ఉద్యోగ మేళా నిర్వహించి సుమారు 500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని స్కిల్ డెవలప్మెంట్ అధికారిని ఆదేశించారు.

# రేషన్‌దారులకు గుడ్‌న్యూస్ 3 నెలల సన్నబియ్యం ఒకేసారి

**- వర్షాల ముందు జాగ్రత్త - ఆగస్టులోనే 3 నెలల రేషన్ పంపిణీ**

**ఆగస్టు-సెప్టెంబర్-అక్టోబర్ కోటా కలిపి ఇవ్వనున్న ప్రభుత్వం**

**ఒక్కో కార్డుకు 18 కిలోలు । ములుగు జిల్లాలో 5,514 మెం బియ్యం సిద్ధం**




ములుగు జిల్లా(ప్రశ్న న్యూస్) రాబోయే వర్షాల నేపథ్యంలో రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ 2026 ఈ మూడు నెలలకు సంబంధించిన సన్నబియ్యం కోటాను ఆగస్టు నెలలోనే ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. వాతావరణ శాఖ జులై చివరి వారంలోనే భారీ వర్షాలు పడతాయని అంచనా వేసిన నేపథ్యంలో లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ముందు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

### సన్నబియ్యం పంపిణీలో తెలంగాణ ప్రత్యేకం.

దేశవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం ఇస్తున్నారు. ఈ లెక్కన 3 నెలలకు కలిపి ఒక్కో కార్డుకు 18 కిలోల బియ్యం అందనుంది.

### ములుగు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి.

ములుగు జిల్లాలో 1.03 లక్షలకు పైగా రేషన్ కార్డులు ఉన్నాయి. 3 నెలలకు కలిపి మొత్తం 5,514 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సేని తెలిపారు. పంపిణీకి తగిన ఏర్పాట్లు చేశామన్నారు.

### థంబ్ 3 సార్లు, సర్వర్ సమస్యలకు చెక్

ఒకేసారి 3 నెలల కోటా తీసుకునేందుకు ప్రతి కార్డుదారుడు 3 సార్లు వేలిముద్ర వేయాల్సి ఉంటుందని అధికారి వివరించారు. పంపిణీ సమయంలో సర్వర్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

# ఆగస్ట్ 24న ఐటిడిఏ ముట్టడికి తుడుందెబ్బ పిలుపు

**ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం బారీ ఆందోళనకు సిద్ధం**

**లంబాడీల అక్రమాలపై కమిషన్ వేయాలి: తుడుందెబ్బ డిమాండ్**

**ఆదివాసీల హక్కుల కోసం ఐటిడిఏ ముట్టడి**

**ఆగస్ట్ 24న తుడుందెబ్బ ఆందోళన**

**పోడు భూములకు పట్టాలు, జీవో 57 అమలు చేయాలని డిమాండ్.**

ఏటూరునాగారం (ప్రశ్న న్యూస్) ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం ఆగస్ట్ 24న ఏటూరునాగారం ఐటిడిఏ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ ప్రకటించింది.
శుక్రవారం గిరిజన భవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా తుడుందెబ్బ కమిటీ సమావేశం జరిగింది. ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్, జాతీయ ఉపాధ్యక్షులు పోడెం బాబు, రాష్ట్ర కార్యదర్శి కుడిమేత సమ్మయ్య, కోరగట్ల లక్ష్మణ్ రావు,-శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్నిబీల్లి గణేష్, ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వటం సుభద్ర హాజరయ్యారు.




### ఐటిడిఏలు ఎడ్ల కొట్టాలుగా మారాయి.

ఈ సందర్భంగా డా. మైపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆదివాసీల మనుగడ దినదిన గండంగా మారిందన్నారు. 1976లో అక్రమంగా ఎస్టీ జాబితాలోకి వచ్చిన లంబాడీలు గత 50 ఏళ్లుగా ఆదివాసీలను దోచుకుంటున్నారని ఆరోపించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. లంబాడీ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ వేయాలని, పోడు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అటవీ శాఖ దాడులు నిలిపివేయాలన్నారు.తెలంగాణ వచ్చిన తర్వాత ఐటిడిఏలను రాష్ట్ర ప్రభుత్వం ఎడ్ల కొట్టాలుగా మార్చిందని విమర్శించారు. సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ జీవో 57 ద్వారా పరిపాలన సరిగా నడవడం లేదన్నారు. ఏజెన్సీ ప్రాంత ఉద్యోగాలను ఏజెన్సీ సర్టిఫికెట్ ద్వారానే భర్తీ చేయాలని, రిక్రూట్మెంట్ అథారిటీ ఐటిడిఏకే ఉండాలని కోరారు. నూతన జోనల్ విధానం పేరిట 29 శాఖలకు సంబంధించిన ఏజెన్సీ ఉద్యోగాలను జనరల్ రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లో భర్తీ చేయడం వల్ల ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. జీవో 3ను సుప్రీంకోర్టు కొట్టివేసిందనే సాకుతో ప్రభుత్వం అన్ని జీవోలను కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### వడ్డీ వ్యాపారులపై కేసులు నమోదు చేయాలి.

వడ్డీ వ్యాపారాలు ఆదివాసీల నడ్డి విరిచాయని, వెంటనే వడ్డీ వ్యాపారస్తులను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. 1/70 చట్టం విషయంలో బడా గిరిజనేతరులు కుట్రలు చేస్తున్నారని, సుప్రీంకోర్టుకు కేసులు వేసి ఏజెన్సీని కాలరాయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ కుట్రలను తిప్పికొడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగుల నేత చాట్ల నాగేశ్వరరావు, ములుగు జిల్లా అధ్యక్షులు నల్లెబోయిన లక్ష్మణ్ రావు, ప్రధాన కార్యదర్శి పాయం కోటీశ్వరావు, మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్తీ శేఖర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు గొరిగే కిరణ్, ప్రధాన కార్యదర్శి మట్టి కృష్ణ, హన్మకొండ అధ్యక్షులు సోయం నాగరాజు, జిల్లా అధ్యక్షులు దబ్బగట్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో సేవాలందించడం అభినందనియం

**ఉద్యోగ విరమణ పొందుతున్న అదనపు ఎస్పీ(అడ్మిన్) చంద్రయ్యకి ఘన సన్మానం**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) అదనపు ఎస్పీ (అడ్మిన్) చంద్రయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎస్పీ మహేష్ బి.గితే ముఖ్య అతిథిగా హాజరై అదనపు ఎస్పీ చంద్రయ్యని ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో అదనపు ఎస్పీ చంద్రయ్య ఎన్నో సంవత్సరాల పాటు అంకితభావంతో, నిజాయితీతో, క్రమశిక్షణతో సేవలందించారని కొనియాడారు. తన విధి నిర్వహణలో సమర్థత, బాధ్యతాయుతమైన వ్యవహారశైలి, సహోద్యోగులతో సత్సంబంధాలు కలిగి శాఖకు మంచి గుర్తింపు తీసుకువచ్చారన్నారు. ఉద్యోగ విరమణ అనేది సేవా జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజ సేవకు కాదని ఎస్పీ అన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సహచర అధికారులు, పోలీస్ సిబ్బంది చంద్రయ్యతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన సేవలను ప్రశంసించారు. అనంతరం పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించి ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ లు, సి.ఐ లు, ఆర్.ఐ లు, ఎస్.ఐ లు, ఏ. ఓ, కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జపాన్‌కు డ్రైవర్ల శిక్షణపై భాగస్వామ్యం దిశగా అడుగులు



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ఐటిడిఆర్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించిన జపాన్ ప్రతినిధులు.రాజన్న సిరిసిల్ల ప్రతినిధి జపాన్‌కు నైపుణ్యమైన భారతీయ ప్రొఫెషనల్ డ్రైవర్లను తీర్చిదిద్దే లక్ష్యంతో హనా విస్టా కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణలోని ఐ టి డి ఆర్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌తో దీర్ఘకాలిక భాగస్వామ్య అవకాశాలను పరిశీలించేందుకు సంస్థ ప్రతినిధులు జూలై 31, 2026న సైట్ విజిట్ నిర్వహించారు. ఇట్టి పర్యవేక్షణ సంస్థ సీఈఓ సయూరి మత్సునో తెలంగాణ ఐఏఎస్ అధికారి హరి ప్రసాద్ ఆదేశానుసరం పర్యావక్షించారు. డ్రైవింగ్ శిక్షణ విధానం, మౌలిక సదుపాయాలు, శిక్షణ పరికరాలు, నిర్వహణ ప్రమాణాలు, మొత్తం శిక్షణ వాతావరణాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు.అలాగే, భారతీయ ప్రొఫెషనల్ డ్రైవర్లకు జపాన్‌లో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పరస్పర సహకారంపై చర్చించి, దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని ఏర్పరచుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.ఈ భాగస్వామ్యం అమల్లోకి వస్తే తెలంగాణ యువతకు జపాన్‌లో ఉపాధి అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇట్టి పర్యవేక్షణలో జిల్లా రవాణాశాఖ అధికారి దేవునూరి శ్రీనివాస్ మోటారు వాహనాల తనిఖీ అధికారి వంశీధర్ ఐటీడీర్ ప్రిన్సిపాల్ దొరయ్ మురుగన్ పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన గోలి సంతోష్

**- ఎర్రవల్లి నివాసంలో భేటీ**

**- రైతాంగ సంక్షేమం పై కేసీఆర్ కీలక దిశా నిర్దేశం**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షులు, గజ్వేల్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గోలి సంతోష్, గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డితో కలిసి ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగానికి సంకేతంగా, రూరల్ సంస్కృతిని గుర్తుచేసేలా రూపొందించిన అందమైన "ఎడ్ల బండి మెమొంటో" ను కేసీఆర్ కి బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. రైతాంగాన్ని అన్ని వేళలా ఆదుకుంటూ, వారిని రాజును చేసే దిశగా నిరంతరం కృషి చేయాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, వ్యాపారులు, నాయకులు రైతాంగానికి తోడుగా నిలవాలని ఆయన సూచించారు. నియోజకవర్గ రైతాంగ సమస్యలు, వ్యవసాయ పరిస్థితులపై ఈ సందర్భంగా నాయకులు మాజీ ముఖ్యమంత్రికి వివరించారు. కెసిఆర్ చూపిన ఆప్యాయతకు, ఇచ్చిన మార్గదర్శకత్వానికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# గజ్వేల్ బిల్డింగ్ పెయింటర్స్ యూనియన్‌కు న్యాయం చేయాలి

**స్థానిక కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్నారంటూ ఆవేదన**

**- న్యాయం జరగకపోతే భారీ ధర్నా చేస్తామని హెచ్చరిక**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )గజ్వేల్ బిల్డింగ్ పెయింటర్స్ యూనియన్ సభ్యులు శుక్రవారం గజ్వేల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.యూనియన్ నాయకుల కథనం ప్రకారం, మోహన్ అనే వ్యక్తి యూనియన్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ తమపై పోలీసు కేసు నమోదు చేయించాడని తెలిపారు. చాలా కాలంగా అత్యంత తక్కువ రేట్లకు పెయింటింగ్ పనులు చేపట్టడంతో పాటు, టైల్స్, బండల పనులు, గోడల నిర్మాణం తదితర పనులను కూడా చేపడుతూ స్థానిక పెయింటర్ల ఉపాధిని దెబ్బతీస్తున్నాడని ఆరోపించారు.
ఈ విషయంపై గతంలోనే అతడిని యూనియన్ కార్యాలయానికి పిలిపించి చర్చించినప్పటికీ, తమ సూచనలను పట్టించుకోకుండా యూనియన్‌కు వ్యతిరేకంగా వెళ్లి తమపై కేసు పెట్టించాడని పేర్కొన్నారు. అలాగే కొంతమంది స్థానికులను కూడగట్టి తమపై దౌర్జన్యానికి పాల్పడే ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా ఆరోపించారు.స్థానిక కార్మికుల జీవనోపాధిని కాపాడుతూ, ఈ వ్యవహారంపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరగకపోతే గజ్వేల్‌లో భారీ స్థాయిలో ధర్నా నిర్వహించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు నర్ర రాజు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇర్ఫాన్, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, సెక్రటరీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా వంటేరు ప్రతాప్ రెడ్డి

**గ్యాస్ లీకేజీ ప్రమాదంలో గాయపడిన కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేత**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )జగదేవపూర్ మండలం నిర్మల్‌నగర్ గ్రామానికి చెందిన ఎర్ర ప్రభాకర్ కుటుంబంలో సుమారు 20 రోజుల క్రితం గ్యాస్ లీకేజీ కారణంగా జరిగిన ప్రమాదంలో కుటుంబ సభ్యులంతా తీవ్రంగా గాయపడ్డారు. వారు ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం, శనివారం గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ గౌరవ శ్రీ వంటేరు ప్రతాప్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పడంతో పాటు వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ ఇంద్రసేన రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, కొండాపోచమ్మ మాజీ చైర్మన్ ఉపేందర్ రెడ్డి, అలీరాజ్‌పేట్ గ్రామ సర్పంచ్ ఎల్లేష్, నిర్మల్‌నగర్ ఉప సర్పంచ్ యాదగిరి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ భూమయ్య, మాజీ సర్పంచ్‌లు చంద్రశేఖర్, కృష్ణ, యాదవ్ రెడ్డి రాజు, మాజీ మండల పరిషత్ ప్రాదేశిక సభ్యుడు కిరణ్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్, బాపురెడ్డి, వెంకట్ గౌడ్, నారాయణ, సాయిలు, నర్సిములు, నరేష్, అశోక్, సురేష్, వెంకట్, మహేష్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, సుధాకర్, శ్రీను, తిరుపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

# జయశ్రీ జ్ఞాపకార్థం విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

**వట్టిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో సేవా కార్యక్రమం**

**- దాతలను అభినందించిన పాఠశాల బృందం**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) జగదేవ్‌పూర్ మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన తాడూరి నరసింహారెడ్డి (రిటైర్డ్ పీజీ హెచ్‌ఎం), తాడూరి రాంరెడ్డి (రిటైర్డ్ ఎంఈఓ, ములుగు), తాడూరి నరేష్‌రెడ్డి (సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, అమెరికా) తమ కుటుంబ సభ్యురాలు జయశ్రీ జ్ఞాపకార్థంగా వట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. సరోజతో పాటు ఉపాధ్యాయులు విజయభాస్కర్‌రెడ్డి, పరుశరాములు, బాలనర్సింహారెడ్డి, మల్లయ్య, బాపురెడ్డి, రవిరాజు దాతలను అభినందిస్తూ వారి సేవా దృక్పథాన్ని కొనియాడారు.ఈ కార్యక్రమం నిర్వహణలో "బాలవికాస విద్యా కమిటీ" చైర్మన్ తాడూరి వెంకటరామిరెడ్డి కీలక పాత్ర పోషించి, దాతల ద్వారా క్రీడా దుస్తులు అందేలా సమన్వయం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.విద్యతో పాటు క్రీడలకు ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ సేవా కార్యక్రమం విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

# ‘ఆజాదీ 501’ సిరీస్ రివ్యూ!



వివిధ భాషలకి చెందిన సిరీస్ లు ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ పైకి పొలోమంటూ దిగిపోతున్నాయి. థ్రిల్లర్ నేపథ్యంలో సాగే కథలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ ముందుకు వెళుతున్నాయి. ఈ మధ్యలో తెలుగు సిరీస్ లు కూడా తమ బలాన్ని నిరూపించుకోవడానికి గట్టిగానే ప్రయత్నిస్తున్నాయి. అలాంటి సిరీస్ గా వచ్చినదే ‘ఆజాదీ 501’. సాయితేజ కల్వకోట ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సిరీస్ కి, శివతేజ దర్శకత్వం వహించాడు. ఈ నెల 29వ తేదీ నుంచి 6 ఎపిసోడ్స్ గా ఈ సిరీస్ ‘ఆహా’లో స్ట్రీమింగ్ అవుతోంది. అది 2014వ సంవత్సరం. జితేంద్ర (సాయితేజ) తన తల్లి ‘యశోద’ .. చెల్లెలు ‘ప్రీతి’తో కలిసి ‘కాకినాడ’లో నివసిస్తూ ఉంటాడు. కొంతకాలం క్రితమే అతని తండ్రి చనిపోతాడు. అతను నిర్మించిన స్కూల్ విషయంలో భాగస్వాములు మోసం చేయడమే అతని మరణానికి కారణమవుతుంది. ఆ స్కూల్ పై అధికారం కోసం కోర్టులో కేసు నడుస్తూ ఉంటుంది. తండ్రి లేకపోవడంతో కుటుంబం బాధ్యత జితేంద్రపై పడుతుంది. అతని సంపాదనకీ .. బాధ్యతలకు పొంతన లేకుండా పోతుంది. మేనమామ చేసిన అవమానం అతణ్ణి మరింత ఆలోచనలో పడేస్తుంది. తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు తెచ్చిపెట్టే బిజినెస్ ఏదైనా చేయాలనే నిర్ణయానికి వస్తాడు. ఈ విషయంలో తన స్నేహితుడైన ‘కిషన్’ సహాయం తీసుకుంటాడు. ఇద్దరూ కలిసి ఇన్వెస్ట్ మెంట్ కోసం శ్రీకాంత్ మెహతాను కలుసుకుంటారు. స్మార్ట్ ఫోన్ కొనాలనేది చాలామంది కల. అయితే ఖరీదు ఎక్కువ కారణంగా అది కొంతమందికే పరిమితమవుతూ ఉంటుంది. అందువలన అతి తక్కువ ధరకి స్మార్ట్ ఫోన్ ఇవ్వాలని జితేంద్ర భావిస్తాడు. చైనా ఫోన్స్ కొనేసి, ‘మేడ్ ఇన్ ఇండియా’ అంటూ తమ లోగో .. తమ బ్రాండ్ పేరుతో మార్కెట్లోకి వదలాలని నిర్ణయించుకుంటాడు.

‘ఆజాదీ 501’ పేరుతో జనంలోకి స్మార్ట్ ఫోన్స్ ను వదులుతాడు జితేంద్ర. సెంట్రమ్ మినిష్టర్ శరత్ గోయెల్ ( హర్షవర్ధన్)తో లాంచ్ చేయిస్తాడు. ‘ఆజాదీ 501’ అనేది ఒక సంచలనంగా మారుతుంది. దాంతో జితేంద్ర లాభాలపై శరత్ గోయెల్ కన్నుపడుతుంది. అదే సమయంలో ఐపీఎస్ ట్రైనీగా ఉన్న చాణక్య చక్రవర్తి ( శశాంక్)కి ఈ స్మార్ట్ ఫోన్ పై అనుమానం తలెత్తుతుంది. ఇక ఈ ప్రొడక్ట్ కి సంబంధించిన సందేహాల ఆధారంగా, నిజానిజాలు తెలుసుకోవడం కోసం స్పెషల్ ఆఫీసర్ గా రఘురామ్ (రవివర్మ) రంగంలోకి దిగుతాడు.

జితేంద్రకి తన బిజినెస్ లో ఎలాంటి అనుభవాలు ఎదురవుతాయి? శరత్ గోయెల్ .. చాణక్య చక్రవర్తి .. రఘురామ్ వైపు నుంచి ఆయన ఎలాంటి సవాళ్లను ఎదుర్కోవలసి వస్తుంది? తన తండ్రి ఆశయమైన స్కూల్ ను జితేంద్ర దక్కించుకోగలుగుతాడా? అతని జీవితంలో చోటుచేసుకునే మలుపులు ఎలాంటివి అనేది మిగతా కథ. ఈ కథ 2014 నుంచి 2018 మధ్యకాలంలో నడుస్తుంది. కొంతకాలం క్రితం స్మార్ట్ ఫోన్స్ కి సంబంధించి జరిగిన ఒక భారీ స్కామ్ ఆధారంగా ఈ సిరీస్ ను రూపొందించారు. అప్పట్లో ఎక్కడ చూసినా ఈ స్కామ్ గురించే మాట్లాడుకున్నారు. ఆ స్కామ్ ను ఆధారంగా చేసుకుని అల్లుకున్న కథనే ఇది. వ్యాపారం – మోసం అనే రెండు కోణాలను టచ్ చేస్తూ ఈ కథ ముందుకు వెళుతుంది. వ్యాపారంలో మోసం చేయడం .. మోసం చేయడం కోసమే వ్యాపారం చేయడం అనేవి ప్రధానమైన అంశాలుగా కనిపిస్తాయి. సాధారణంగా అవినీతికి .. అక్రమాలకు పాల్పడేవారిని బ్లాక్ మెయిల్ చేస్తూ, అధికారులు .. రాజకీయనాయకులు తమ పబ్బం గడుపుకుంటూ ఉంటారు. కానీ ఈ కథలో నాయకుడు అటు రాజకీయ నాయకులకుగానీ .. ఇటు అధికారులకు గాని భయపడకుండా .. వాళ్లకి లంచాలు ఇవ్వకుండా ఎలా తన ప్లాన్ వర్కౌట్ చేస్తూ వేళ్లాడనేది దర్శకుడు ఆవిష్కరించిన తీరు ఇంట్రస్టింగ్ గా అనిపిస్తుంది.ఒక వైపున హీరో తనదైన పద్ధతిలో తన ప్లాన్ వర్కౌట్ చేస్తూ వెళుతుంటాడు. అతని మోసాన్ని బయటపెట్టడానికి అధికారం – పలుకుబడి ఉన్న ముగ్గురు బలమైన వ్యక్తులు బరిలోకి దిగుతారు. హీరోకి మూడు వైపుల నుంచి ఈ ముగ్గురు వ్యక్తులు కదలడం ఈ కథలో ఆసక్తిని రేకెత్తించే ప్రధానమైన అంశంగా కనిపిస్తుంది.హీరో ఒక వైపున తండ్రి ఆశయాన్ని నెరవేర్చాలి. మరో వైపున తల్లి ముచ్చట తీర్చాలి. ఇంకొక వైపున తన కలను నిజం చేసుకోవాలి. ఈ బాధ్యతలన్నీ హీరో భుజాలపై ఉంటాయి.

ఇక తనని ఒక చట్రంలో ఇరికించడానికి ప్రయత్నిస్తున్న శత్రువులకు చిక్కకుండా పావులు కదపాలి. ఇలాంటి ఒక క్లిష్టమైన దారిలో హీరో కొనసాగించే ప్రయాణం ప్రేక్షకులను ఆకట్టుకుంటూనే వెళుతుంది. కథ – స్క్రీన్ ప్లే రెండూ చాలా నీట్ గా తమ ప్రయాణాన్ని కొనసాగిస్తాయి. ఎక్కడా కన్ఫ్యూజన్ అనేది లేకుండా ప్రేక్షకులను ముందుకు తీసుకుని వెళతాయి. కథలోని ప్రతి అంశం క్లారిటీతో ముందుకు వెళుతుంది. అలాగే ప్రధానమైన పాత్రలన్నీ కూడా బలంగా కనిపిస్తాయి. చివర్లో వచ్చే ట్విస్ట్ .. ఈ కంటెంట్ ను మరింత పెర్ఫెక్ట్ గా మారుస్తుంది. మదర్ సెటిమెంట్ పాళ్లు కాస్త తగ్గినట్టు అనిపించినా, హీరో వైపు నుంచి లవ్ ట్రాక్ లేకపోవడం కాస్త అసంతృప్తిని కలిగించినా, ఒక భారీ స్కామ్ పై ఈ మధ్య కాలంలో వచ్చిన ఇంట్రెస్టింగ్ సిరీస్ గా చెప్పుకోవచ్చు.


# పరిణతితో ఆలోచిస్తున్నా!



శృతిహాసన్ నటిగా మారి 17ఏండ్లయింది. సోహన్‌షా దర్శకత్వంలో 2009లో వచ్చిన బాలీవుడ్ సినిమా ‘లక్’ నటిగా ఆమె తొలి సినిమా. ఆ తర్వాత అదే ఏడాది తెలుగులో ‘అనగనగా ఒక ధీరుడు’లో నటించారు శృతిహాసన్. రెండూ పెద్దగా ఆడలేదు. తెలుగులో వచ్చిన ‘గబ్బర్‌సింగ్’ ఆమెకు తొలి హిట్. ఇక అప్పట్నుంచి వెనక్కు తిరిగి చూసుకునే అవసరం రాలేదు శృతిహాసన్‌కి.నటిగా, సంగీత దర్శకురాలిగా, గాయనిగా వెండితెరపై బహుముఖ ప్రజ్ఞ చాటుతూ తండ్రికి తగ్గ తనయ అనిపించుకున్నారామె. విజయ్‌సేతుపతితో ఆమె నటించిన ‘ట్రైన్’ చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా జరిగిన ఓ భేటీలో ఆమె మాట్లాడుతూ ‘సినిమాని మాత్రమే కాదు.. మనుషులని, మనసులని, వ్యక్తిత్వాలని సైతం అర్థం చేసుకునే పరిణతిని ఈ 17ఏండ్ల ప్రయాణం నాకిచ్చింది.

ఇప్పుడు నేను ఎలాంటి విమర్శలనైనా ఎదుర్కొనగలను. ఆ మానసిక ధృఢత్వాన్ని కూడా ఈ 17ఏండ్ల ప్రయాణమే ఇచ్చింది. ఇండస్ట్రీలోకి రాకముందు సినిమా విజయంలో నటుల పాత్రే కీలకం అనుకునేదాన్ని. కానీ ఆ విజయం వెనుక 24 శాఖల కష్టం ఎంత ఉందో నటిని అయ్యాక అర్థమైంది’ అన్నారు శృతిహాసన్.

# అండర్‌వరల్డ్ డాన్ జాన్



దుల్కర్ సల్మాన్ తాజా చిత్రం ‘ఐయామ్ గేమ్’ ట్రైలర్‌ను అగ్ర హీరో ఎన్టీఆర్ లాంచ్ చేశారు. ఈ ఫాంటసీ థ్రిల్లర్ చిత్రానికి నహాస్ హిదాయత్ దర్శకత్వం వహించారు. ఆగస్ట్ 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో డాన్ జాన్ అనే అండర్ వరల్డ్ డాన్‌లా కనిపించనున్నారు దుల్కర్ సల్మాన్. సీట్‌ఎడ్జ్ థ్రిల్లర్ చిత్రమిదని, ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుందని, యాక్షన్, విజువల్స్ అబ్బురపరుస్తాయని మేకర్స్ తెలిపారు. దాదాపు 100కుపైగా లొకేషన్లలో ఈ సినిమా చిత్రీకరణ జరిపామని, ఇందులో అల్ట్రాస్టైలిష్ డాన్‌గా దుల్కర్ సల్మాన్ పాత్ర హైలైట్‌గా నిలుస్తుందని దర్శకుడు తెలిపారు. కయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతాన్నందిస్తున్నారు.



# ‘సర్దార్ 2’ రిలీజ్ డేట్‌పై సందేహాలకు చెక్.. కొత్త అప్‌డేట్‌తో సర్‌ప్రైజ్ ఇవ్వనున్న మేకర్స్

కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యాక్షన్ స్పై థ్రిల్లర్ ‘సర్దార్’ చిత్రానికి ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించిన సంగతి తెలిసిందే. దర్శకుడు మిస్కిన్ రూపొందించిన ఈ చిత్రం తమిళంతో పాటు తెలుగులోనూ మంచి విజయాన్ని అందుకుంది. దీంతో దీనికి సీక్వెల్‌గా‘సర్దార్ 2’ ను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఈ సీక్వెల్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కొన్నాళ్ల క్రితమే చిత్ర బృందం సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో అభిమానులు ఆ తేదీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే తాజాగా విడుదల చేసిన ఓ కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. మేకర్స్ ఈరోజు ప్రత్యేక అప్‌డేట్ రానుందని ప్రకటించినప్పటికీ, పోస్టర్‌లో విడుదల తేదీని ప్రస్తావించలేదు. దీంతో సినిమా విడుదల వాయిదా పడుతోందా? కొత్త రిలీజ్ డేట్ ప్రకటించనున్నారా? అనే సందేహాలు అభిమానుల్లో మొదలయ్యాయి. అయితే సినీ వర్గాల సమాచారం ప్రకారం ‘సర్దార్ 2’ విడుదల తేదీలో ఎలాంటి మార్పు లేదని, సినిమా ముందుగా ప్రకటించినట్లుగానే సెప్టెంబర్ 10న థియేటర్లలోకి రానుందని తెలుస్తోంది. పోస్టర్‌లో రిలీజ్ డేట్ లేకపోవడం కేవలం కొత్త అప్‌డేట్‌పై ఆసక్తిని పెంచేందుకేనని సమాచారం.మేకర్స్ విడుదల చేయబోయే ఈ తాజా అప్‌డేట్ ఏమిటన్నది ప్రస్తుతం సస్పెన్స్‌గా మారింది. కొత్త టీజర్, ట్రైలర్ రిలీజ్ డేట్, గ్లింప్స్ లేదా మరో కీలక ప్రకటన ఉండే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ‘సర్దార్ 2’ ను పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయడానికి చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. తొలి భాగం సాధించిన విజయాన్ని మించి ఈ సీక్వెల్ ఉండేలా యాక్షన్, స్పై ఎలిమెంట్స్, విజువల్స్‌ను మరింత గ్రాండ్‌గా రూపొందించినట్లు సమాచారం. ఇప్పటికే కార్తీ అభిమానులతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ ఈ సినిమాపై మంచి క్రేజ్ ఏర్పడింది. మరికొన్ని గంటల్లో రానున్న అధికారిక అప్‌డేట్‌తో ఈ అంచనాలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# కవిన్ ఇంట్లో డబుల్ సెలబ్రేషన్..



కోలీవుడ్ యువ హీరో కవిన్ జీవితంలో మరపురాని ఆనంద క్షణాలు చోటు చేసుకున్నాయి. తన నటనతో తమిళ ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కవిన్ ఇప్పుడు వ్యక్తిగత జీవితంలో కొత్త బాధ్యతను స్వీకరించారు. ఆయన భార్య మోనికా కవల పిల్లలకు జన్మనివ్వగా, ఈ శుభవార్తను స్వయంగా కవిన్ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ వార్త తెలిసిన వెంటనే సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియాలో శుభాకాంక్షల వర్షం కురిపిస్తున్నారు. 2023 ఆగస్టులో తన చిరకాల స్నేహితురాలు మోనికాను వివాహం చేసుకున్న కవిన్.. అప్పటి నుంచి వ్యక్తిగత జీవితాన్ని ఎంతో గోప్యంగా ఉంచుతూ వచ్చారు. తాజాగా తమ కుటుంబంలో కొత్త సభ్యులు చేరిన విషయాన్ని తెలియజేస్తూ ఎక్స్ (ట్విట్టర్)లో ఎమోషనల్ పోస్ట్ చేశారు. మా జీవితాలను రెట్టింపు ఆనందంతో నింపినందుకు దేవుడికి కృతజ్ఞతలు. మాకు ఒక బాబు, ఒక పాప జన్మించారు అంటూ ఆయన చేసిన పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది.ఈ శుభవార్త తెలిసిన వెంటనే అభిమానులు, సినీ ప్రముఖులు సోషల్ మీడియాలో కవిన్ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. “డబుల్ బ్లెస్సింగ్స్”, “క్యూట్ ఫ్యామిలీ”, “కంగ్రాట్స్ కవిన్” అంటూ వేలాది కామెంట్లు చేస్తున్నారు. అభిమానులు ఈ జంటకు ఆరోగ్యంగా, ఆనందంగా పిల్లలు పెరగాలని ఆకాంక్షిస్తున్నారు. ఇది మరింత ప్రత్యేకం కావడానికి మరో కారణం కూడా ఉంది. కవిన్ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచిన ‘డాడా’ సినిమాలో ఆయన ఓ చిన్నారి తండ్రి పాత్రలో నటించారు. ఆ సినిమాలో తండ్రి పాత్రలో భావోద్వేగ నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న కవిన్.. ఇప్పుడు నిజ జీవితంలో కూడా తండ్రిగా మారడంతో అభిమానులు “రీల్ డాడా.. ఇప్పుడు రియల్ డాడా” అంటూ సోషల్ మీడియాలో ఆసక్తికర పోస్టులు పెడుతున్నారు. కెరీర్ పరంగా కూడా కవిన్ ప్రస్తుతం మంచి జోష్‌లో ఉన్నారు. వరుస చిత్రాలతో బిజీగా ఉన్న ఆయన.. ప్రస్తుతం స్టార్ హీరోయిన్ నయనతారతో కలిసి ‘హాయ్’ (ఎఱ) చిత్రంలో నటిస్తున్నారు. దర్శకుడు విష్ణు ఎడవన్ తెరకెక్కిస్తున్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌పై మంచి అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఒకవైపు కెరీర్‌లో వరుస అవకాశాలు, మరోవైపు వ్యక్తిగత జీవితంలో కవల పిల్లల రాకతో కవిన్ జీవితంలో ఆనందాలు రెట్టింపయ్యాయి. ప్రస్తుతం ఆయన కుటుంబానికి అభిమానులతో పాటు సినీ పరిశ్రమ నుంచి కూడా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి

## అబ్బురపరిచే విజువల్స్‌తో
# ‘రామాయణ’



యుగాలు మారినా నిత్యనూతనం శ్రీరామచరితం. ధర్మనిష్ఠ, సత్యసంధతతో దైవాంశ మూర్తీభవించిన పరిపూర్ణ మానవుడిగా ఆయన గాథ చిరస్మరణీయం. కొన్ని తరాలుగా వెండితెరను పావనం చేస్తున్న ఈ మహోన్నత ఇతిహాసం మరోమారు ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నది. సాయిపల్లవి, రణబీర్‌కపూర్ సీతారాముల పాత్రల్లో నితేష్ తివారి దర్శకత్వంలో రూపొందుతున్న ‘రామాయణ’ ట్రైలర్‌ను గురువారం బ్రహ్మ ముహూర్తంలో విడుదల చేశారు. ‘దేవలోకం..భూలోకం.. పాతాళలోకం..ముల్లోకాల్లో ఇక ఒక్కటే సామ్రాజ్యం..రావణ రాజ్యం’ అంటూ రావణ పాత్రధారి యశ్ సంభాషణలతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ‘చీకట్లను పారద్రోలేందుకు ప్రతి యుగంలోనూ శ్రీమహావిష్ణువు ఉద్భవిస్తాడు’ అంటూ రాముడిగా రణబీర్‌కపూర్ ఉపోద్ఘాతం ప్రత్యేకాకర్షణగా నిలిచింది. ఇందులో సీతారాముల కల్యాణం మొదలుకొని రామరావణ యుద్ధం వరకూ ప్రతీ ఘట్టం అంతర్జాతీయ స్థాయి గ్రాఫిక్స్ హంగులు, నిర్మాణ విలువలతో అబ్బురపరచింది. ఆస్కార్ విజేతలు హాన్స్‌జిమ్మర్, ఏ.ఆర్.రెహమాన్ సంగీతం హైలైట్‌గా నిలిచింది. విశ్వవ్యాప్తమైన ఈ కథను సంపూర్ణ నిజాయితీతో, ప్రామాణికతతో తెరకెక్కించానని దర్శకుడు నితేష్ తివారి పేర్కొన్నారు. రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తొలిభాగం ఈ ఏడాది దీపావళి రోజున ప్రేక్షకుల ముందుకురానుంది.

# డాక్టర్ బయోపిక్‌లో?



అస్సామీ సొగసరి కయాదు లోహర్ చేతిలో ప్రస్తుతం అరడజను సినిమాలున్నాయి. అవన్నీ పెద్ద సినిమాలే. ఇప్పటివరకు కెరీర్‌లో బ్లాక్‌బస్టర్ హిట్ ఏదీ లేకున్నా.. అవకాశాల పరంగా మాత్రం దూసుపోతున్నదీ భామ. ఆకట్టుకునే స్క్రీన్‌ప్రజెన్స్, చలాకీతనం కలబోసిన నటనతో ఈ అమ్మడు యువతరంలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. అదే భారీ ఆఫర్లకు కారణమని చెబుతున్నారు. తాజాగా ఆమె తమిళంలో మరో బంపరాఫర్‌ను దక్కించుకుంది. అగ్ర హీరో సూర్య 48వ సినిమాలో కయాదు లోహర్ కీలక పాత్రకు ఎంపికైంది. ‘జై భీమ్’ ఫేమ్ టీజే జ్ఞానవేల్ ఈ చిత్రానికి దర్శకుడు. పేదల పాలిట పెన్నిధిగా ప్రసి ద్ధికెక్కిన చెన్నై డాక్టర్ కృష్ణ వరదాచారి తిరువేంగడం జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రోగుల వద్ద కేవలం ఐదు రూపాయల ఫీజు తీసుకునే ఈయన ‘ఐదు రూపాయల’ డాక్టర్‌గా ప్రజల మన్ననలు అందుకున్నారు. ఈ సినిమాలో కయాదు లోహర్ టీచర్ పాత్రలో కనిపించనుందని, కథాగమనంలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని తెలిసింది. త్వరలో ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడనుంది.

# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

**ఆపరేషన్ ముస్కాన్‌లో నెల రోజుల్లో 112 మంది బాలల రెస్క్యూ**

**75 కేసులు నమోదు.. బాల కార్మికులను పనిలో పెట్టుకునే వారిపై కఠిన చర్యలు**

**మెదక్ అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) రాష్ట్రవ్యాప్తంగా జూలై 1వ తేదీన ప్రారంభమైన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నెల రోజుల పాటు మెదక్ జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా కొనసాగిందని మెదక్ అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, తెలిపారు.ఆపరేషన్ ముస్కాన్ ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై బాల కార్మికుల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జిల్లాలోని హోటళ్లు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, వ్యాపార సముదాయాలు తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి రక్షించడం జరిగింది. రక్షించిన బాలలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (జఔజ) ముందు హాజరుపరిచి, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం తల్లిదండ్రులకు లేదా సంరక్షణ కేంద్రాలకు అప్పగించడం జరిగిందని తెలిపారు.నెల రోజుల వ్యవధిలో జిల్లావ్యాప్తంగా 112 మంది బాలలను రక్షించి, వారి తల్లిదండ్రులకు లేదా సంరక్షణ కేంద్రాలకు అప్పగించడం జరిగిందన్నారు. బాల కార్మికులను పనిలో ఉంచుకున్న యజమానులపై 75 కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.పిల్లల బాల్యం బడులకు అంకితం కావాలని, వారు కార్మికులుగా పనిచేయకుండా విద్యను అభ్యసించి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని అదనపు ఎస్పీ సూచించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, ఇకపై కూడా బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామనిహెచ్చరించారు.ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నెల రోజుల పాటు పోలీస్ శాఖతో పాటు కార్మిక, విద్య, మహిళా శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య, రెవెన్యూ తదితర శాఖల సమిష్టికృషితోవిజయవంతంగాకొనసాగిందన్నారు. బాల కార్మికుల నిర్మూలన కోసం ఇదే సమన్వయంతో భవిష్యత్తులో కూడా నిరంతరం చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే విధంగా మెదక్ జిల్లా పోలీస్ శాఖ అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం కృషి చేస్తుందని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐ రాజశేఖర్ రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు ఉప్పలయ్య, హెల్త్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ నవ్య (జూూా), డీసీపీయూ ఇన్‌చార్జి నాగరాజు, ఏఎల్ఓ మెదక్ కమృద్దీన్, తిరుపతి, ఏఎల్ఓ నర్సాపూర్ సత్యేంద్ర ప్రసాద్, అశోక్ మిషన్ ఎన్జీవో సిబ్బంది, రెండు డివిజన్లకు చెందిన ఆపరేషన్ ముస్కాన్ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

# చిన్నప్పటి స్నేహితున్ని మోసం చేసిన శంకర్ లాల్.

**కరీంనగర్లో భారీ చోరీ కేసులో మరో ట్విస్ట్..**
**శంకర్ లాల్ కేసులో మహిళ అరెస్ట్**
**శంకర్ లాల్‌కు సహకరించినట్లు పోలీసుల విచారణలో మహిళ అంగీకారం**
**రూ.26 లక్షల నగదు చోరీలో తన ప్రమేయం ఉన్నట్లు వెల్లడి**
**పారిపోవడానికి సిద్ధమైన సమయంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు**
**మొబైల్ ఫోన్ స్వాధీనం.. కేసు దర్యాప్తు .**
**కొనసాగుతోందన్న రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి.**
**డ్రంబులో దాచిన డబ్బుకు కన్నం వేసిన శంకర్ లాల్.**
**కారు. సెల్ ఫోన్. సీజ్ చేసిన పోలీస్ అధికారులు.**






మంథని ( ప్రశ్న న్యూస్) ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సంచలనం సృష్టించిన రూ.26 లక్షల నగదు చోరీ కేసులో పోలీసులు మరో కీలక ముందడుగు వేశారు. ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామానికి చెందిన తగరం శంకర్ లాల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసులో అతనికి సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేశవపట్నం మండలం చింతగుట్టపల్లి గ్రామానికి చెందిన ఆడెపు రేష్మను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం మధ్యాహ్నం తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న రేష్మను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు.పోలీసుల కథనం ప్రకారం, శంకర్ లాల్ అరెస్ట్ వార్తలను టీవీలు, పత్రికల్లో చూసిన అనంతరం తనను కూడా పోలీసులు అరెస్ట్ చేసే అవకాశం ఉందని భావించి, చంద్రపూర్ వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌లో వేచి ఉండగా ఆమెను అదుపులోకి తీసుకున్నారు.విచారణలో దొంగతనం జరిగిన రోజు తగరం శంకర్ లాల్‌తో కలిసి తీగలగుట్టపల్లిలోని అటవీ శాఖ అధికారి శ్రీనివాస్ ఇంట్లోకి ప్రవేశించి, తాళాలు పగులగొట్టి, బాత్రూమ్‌లో ప్లాస్టిక్ డ్రమ్ములో దాచిన సుమారు రూ.26 లక్షల నగదును అపహరించినట్లు ఆమె అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. చోరీ చేసిన నగదులో తనకు కూడా వాటా ఇస్తానని శంకర్ లాల్ చెప్పాడని, అయితే అనంతరం డబ్బు ఇవ్వకుండా స్వగ్రామానికి వెళ్లిపోయాడని, తర్వాత అతడు అరెస్ట్ కావడంతో తాను చిక్కుల్లో పడినట్లు విచారణలో వెల్లడించినట్లు పోలీసులు పేర్కొన్నారు.శంకర్ లాల్‌తో మాట్లాడేందుకు ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను కూడా రేష్మ స్వచ్ఛందంగా అప్పగించిందని, దానిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం పంచనామా నిర్వహించి ఆమెను అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరిన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి వెల్లడించారు.

**ఫ్యాక్ట్ బాక్స్‌కేసు ముఖ్యాంశాలు**

చోరీకి గురైన నగదు : సుమారు రూ.26 లక్షలు
ఘటన స్థలం : తీగలగుట్టపల్లి
బాధితుడు : అటవీ శాఖ అధికారి శ్రీనివాస్
ఇప్పటికే అరెస్ట్ : తగరం శంకర్ లాల్
తాజాగా అరెస్ట్ : ఆడెపు రేష్మ
దర్యాప్తు : కరీంనగర్ రూరల్ పోలీసులు
కరీంనగర్ చోరీ కేసు నేపథ్యం
మీరు పంపిన వివరాల ప్రకారం ప్రస్తుతం పోలీసులు వెల్లడించిన సమాచారం ఏమిటంటే:

అటవీ శాఖ అధికారి శ్రీనివాస్ ఇంట్లో రూ.26 లక్షల నగదు చోరీ జరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా తగరం శంకర్ లాల్‌ను ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఇప్పుడు ఆడెపు రేష్మను సహ నిందితురాలిగా అరెస్ట్ చేశారు. మొబైల్ ఫోన్‌తో పాటు ఇతర ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది.

# కొల్చారం మండలం వ్యాప్తంగా

## భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**గ్రామ సర్పంచ్ సాదుల సప్న ఉషయ్య**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండలం వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొల్చారం మండలం కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఊసయ్య తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పాడు బడిన ఇండ్లు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, కమ్యూనిటీ హాళ్లను పరిశీలించి, ఎవరైనా అందులో నివసిస్తుంటే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.వర్షాల సమయంలో వాగులు, వంకలు, చెరువులు, కాలువలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదని సూచించారు. వరద నీటిలో ప్రయాణించడం ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులు మినహా భారీ వర్షాల సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ తీగలు తెగి పడిన ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని, అలాంటి సంఘటనలు కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాల ప్రజలు నీటి మట్టాన్ని నిరంతరం గమనిస్తూ, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. రైతులు తమ వ్యవసాయ పరికరాలు, ఎరువులు, విత్తనాలను సురక్షిత ప్రదేశాల్లో నిల్వ చేసుకోవాలని సూచించారు.వాహనదారులు భారీ వర్షాల సమయంలో అధిక వేగంతో ప్రయాణించకుండా జాగ్రత్త వహించాలని, నీరు నిలిచిన రహదారులపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ సాదుల సప్న ఊశయ్య తెలిపారు.

# మూడు నెలల రేషన్ పంపిణీని సద్వినియోగం చేసుకోవాలి

**రేషన్ కార్డుల వఖ్జ - తేదీ పొడిగింపు**

**జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా పరిధిలోని అన్ని రేషన్ కార్డుదారులకు తెలియజేయునది ఏమనగా, ప్రభుత్వం ఆగస్టు, సెప్టెంబర్ మరియు అక్టోబర్–2026 నెలలకు సంబంధించిన మూడు నెలల బియ్యం కోటాను ఒకేసారి పంపిణీ చేస్తున్నది.కావున ప్రతి రేషన్ కార్డుదారుడు 01.08.2026 నుండి తమ సమీప ఫెయిర్ ప్రైస్ షాప్‌కు వెళ్లి మూడు నెలల బియ్యం కోటాను తప్పనిసరిగా పొందవలెను.అదేవిధంగా, రేషన్ కార్డులోని ప్రతి సభ్యునికి 31.08.2026 లోపు e-KYC పూర్తి చేయించుకోవాలి. చిన్నారుల e-KYCను ఐరిస్ (Iris) డివైస్ ద్వారా సులభంగా పూర్తి చేయవచ్చు.మూడు నెలల బియ్యం కోటాను సకాలంలో పొందడంతో పాటు, కుటుంబ సభ్యులందరి e-KYCను తప్పనిసరిగా పూర్తి చేయించుకొని ప్రభుత్వ సేవలను నిరంతరంగా పొందగలరు.మెదక్ జిల్లా పరిధిలోని అన్ని ఫెయిర్ ప్రైస్ షాప్ (FPS) డీలర్లకు ముఖ్య సూచనలులి మెదక్ జిల్లా పరిధిలోని అన్ని FPS డీలర్లు 01.08.2026 నుండి షాపులను నిర్ణీత సమయానికి తెరిచి, లబ్ధిదారులకు ఆగస్టు, సెప్టెంబర్ మరియు అక్టోబర్–2026 నెలలకు సంబంధించిన మూడు నెలల బియ్యం కోటాను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా పంపిణీ చేయవలెను.అలాగే, మీ షాపు పరిధిలో e-KYC పెండింగ్‌లో ఉన్న ప్రతి లబ్ధిదారునికి వ్యక్తిగతంగా సమాచారం అందించి, 31.08.2026 లోపు 100% e-KYC పూర్తి అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నారుల e-KYCను ఐరిస్ (Iris) డివైస్ ద్వారా పూర్తి చేయించాలి.ప్రతి గ్రామంలో చాటింపు (మైక్ అనౌన్స్‌మెంట్) ద్వారా మూడు నెలల బియ్యం పంపిణీ మరియు e-KYC పూర్తి చేయవలసిన విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలి. ప్రతి రోజు e-KYC పురోగతి మరియు బియ్యం పంపిణీని సమాంతరంగా నిర్వహిస్తూ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించవలెను అని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## బిఆర్ఎస్ పార్టీ బలోపేతంలో

# యువత పాత్ర కీలకం.

**మావురం. రాజుకు జన్మదిన శుభాకాంక్షలు శుభాకాంక్షలు.**

**బిఆర్ఎస్ నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి యువతే ప్రధాన శక్తి అని, ప్రజా సేవే యువ నాయకుల లక్ష్యంగా ఉండాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. మెదక్ జిల్లా నిజాంపేట్ మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు మావురం రాజు జన్మదిన వేడుకలను హైదరాబాద్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కంఠరెడ్డి తిరుపతిరెడ్డి మావురం రాజుతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించి పార్టీ కోసం ఆయన అందిస్తున్న సేవలను అభినందించారు. గ్రామస్థాయిలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ప్రజా సమస్యల పరిష్కారంలో మావురం రాజు చురుకైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.యువశక్తి చైతన్యంతోనే సమాజంలో సానుకూల మార్పులు సాధ్యమవుతాయని పేర్కొన్న ఆయన.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని యువతకు సూచించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే వారికి భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు లభిస్తాయని, మావురం రాజు పార్టీకి, ప్రజలకు మరింత విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు.పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కృషి చేస్తే బీఆర్ఎస్ మరింత బలోపేతం అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మావురం రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ పిఎసిఎస్ చైర్మెన్ పప్పుల బాపురెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్య రెడ్డి,ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మెన్ బాలాగౌడ్, పాపన్నపేట్ మాజీ మార్కెట్ చైర్మెన్ వెంకట్రామిరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు కొత్తూరి. శ్రీనివాస్ బిఆర్ఎస్వి నియోజకవర్గ నాయకులు గజ్జి నవీన్ రాజకుపల్లి సర్పంచ్ కనకరాజు, నాయకులు సాంగు స్వామి, రవి, మోహన్ రెడ్డి, నరేందర్, పరశురాం , మధవత్ రాజు, వార్డ్ మెంబర్స్ పంపారా నాగేష్, నస్కల్ ఎల్లం యాదవ్, బన్నీ సాయి తదితరులు పాల్గొన్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి ఘన నివాళి




వెంకటాపురం( ప్రశ్న న్యూస్ ) వరంగల్ జిల్లా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని ఆర్ఎంబి గెస్ట్ హౌస్‌లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప రాంబాబు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గంప రాంబాబు, ఉద్యమకారుడు చిడెం రవికుమార్ మాట్లాడుతూ... పెద్ది సుదర్శన్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేసిన నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం, ఆయన చూపిన బాటలో నడవడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ముడుంబా శ్రీను, వేల్పూరి లక్ష్మీనారాయణ, గడ్డం వివేక్, బట్ట నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## కుట్టు శిక్షణ పొందిన వారికి

# ఉచిత మిషన్ల పంపిణీ

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న నాచారం**

**సీఐ ధనుంజయ, ఎస్సై మైబెలి**




నాచారం (ప్రశ్న న్యూస్) అమెరికాలోని హోప్ ఫర్ హ్యూమానిటీ సంస్థ, విజయవాడకు చెందిన అలర్ట్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మల్లాపూర్ సూర్యనగర్ కాలనీలో నిర్వహిస్తున్న పద్మ ఫ్యాషన్ కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం 11వ బ్యాచ్ మహిళలకు సర్టిఫికెట్‌ల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాచారం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ, సబ్ ఇన్‌స్పెక్టర్ మైబెలి, డబ్ల్యూఏఎస్ఐ రజిని హాజరై, శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన మహిళలకు తమ చేతుల మీదుగా సర్టిఫికెట్‌లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా స్వావలంబన సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సత్య ప్రసాద్, శ్రీకాంత్, శిక్షణ కేంద్ర నిర్వాహకులు సరిత, నరేంద్ర, అలాగే ఈ 11 వ బ్యాచ్ మహిళలకు అమెరికాలోని పీటీఏ సంస్థ సభ్యుల విరాళంతో సహకరించిన స్రవంతి,సుభాష్ కుటుంబ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. హోప్ ఫర్ హ్యూమానిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మ పని కోనేరు మల్లాపూర్ సెంటర్ దాదాపు మూడు సంవత్సరాల నుండి నడపడం జరుగుతుందని ఇప్పటికీ 11 బ్యాచ్లు మొత్తం కలిపి 60 మంది మహిళల వరకు నేర్చుకున్నారు అని హోప్ ఫర్ హెుమానిటీ ఫౌండర్ కోటేశ్వర రావు తెలిపారు.

# కాళికాదేవి గుడికి "5"లక్షల ఎమ్మెల్యే సహాయం



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న మూడో వార్డులో అతిపూరాతన కాళికాదేవి ఆలయానికి స్థానిక ప్రజలే కాకుండా,స్థానికేతరులు సైతం తండోపతండాలుగా తరలి వచ్చి కోరిన కోర్కెలు తీర్చే అమ్మకు ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు.ఈనేపథ్యంలో గతంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ "3"వార్డుకు వచ్చినప్పుడు మహిమా గల శ్రీ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అప్పుడే ఎమ్మెల్యే తన మనసులో అమ్మకు తనవంతు సేవ చేయాలని మనుస్సులో కోరుకున్నారు.అలాగే స్థానిక ప్రజలు కోరిక మేరకు అమ్మవారికి ఏమైనా మీ గుర్తుగా దేవాలయానికి సేవ చేయండి అనడంతో యుద్ధప్రాతిపదికన ఎమ్మెల్యే శ్రీ గణేష్ శ్రీ కాళికాదేవి ఆలయానికి ఐదు లక్షల రూపాయలు విలువచేసే గ్రానైట్ ని ఇస్తున్నట్లు చెప్పారు.టిపిసిసి మాజీ సెక్రటరీ,మూడో వార్డు నాయకులు రాజేష్ యాదవ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు ఆనందోత్సాహాలతో స్వీట్లు పంచుకున్నారు.ఎమ్మెల్యే శ్రీ గణేష్ కి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మూడో వార్డు ఇన్చార్జ్ మహేష్ యాదవ్, మూడో వార్డు అధ్యక్షుడు శంకర్, శ్రీనివాస్ గౌడ్,పరమేష్,అన్ననగర్ మురళీ, సుదర్శన్,శ్రీకాంత్,స్వప్న,సరిత,స్వరూప,దర్గ రవి, వినోద్, కంటోన్మెంట్ ఎన్ ఎస్ యు ఐ నాయకులు ఆదిత్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాటం మరిచిన బీజేపీ.?



- గ్రేటర్ హైదరాబాద్‌లో కనిపించని నియోజకవర్గ ఇన్‌చార్జీలు
- ప్రజల ప్రశ్నలకు బిజెపి నేతల సమాధానం ఎప్పుడు.?
- గ్రేటర్ హైదరాబాద్ లో బిజెపి నియజకవర్గ ఇంచార్జీలు ప్రజలోకి ఎప్పుడు వస్తారో
- జీ హెచ్ ఎం సి ఎన్నికలకు ముందే ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్న వైనం

**"తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రం ప్రజా సమస్యలపై కనీస స్థాయిలో పోరాటం చేయడం లేదన్న విమర్శలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఒకప్పుడు ప్రజల సమస్యలపై ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తూ ప్రభుత్వాలను నిలదీసిన నాయకత్వం ఇప్పుడు ఎక్కడ పోయింది.? గత దశాబ్ద కాలం క్రితం ఉన్న ఉత్సాహాన్ని కొనసాగించలేకపోతోందన్న ప్రశ్నలు ప్రజల నుండి తలెత్తుతున్నాయి"**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్ )** గ్రేటర్ హైదరాబాద్‌లోని అనేక నియోజకవర్గాల్లో తాగునీటి సమస్యలు, దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ వైఫల్యాలు, ట్రాఫిక్ కష్టాలు, చెరువుల ఆక్రమణలు, పారిశుద్ధ్య లోపాలు, అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు రోజురోజుకూ పెరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఈ సమస్యలపై బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు ప్రజల తరఫున పోరాడుతున్న దాఖలాలు ఎక్కడ కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ప్రశ్నించే స్వరం తగ్గిందా..?

ప్రతిపక్ష పార్టీగా ప్రజల తరఫున అధికారులను నిలదీయడం, సమస్యలను వెలుగులోకి తేవడం, పరిష్కారానికి ఒత్తిడి తేవడం కీలక బాధ్యతగా భావిస్తారు. అయితే గ్రేటర్ హైదరాబాద్ తో పాటు తెలంగాణ పరిధిలోని చాలా నియోజకవర్గాల్లో బీజేపీ నాయకత్వం ఆ బాధ్యతను పూర్తిగా మరిచిపోయిందని విమర్శకులు ఆరోపిస్తున్నారు. స్థానిక సమస్యలపై నిరసనలు, వినతిపత్రాలు, ప్రజా ఉద్యమాలు అత్యంత అరుదుగా కనిపిస్తున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజల్లో కాకుండా కార్యక్రమాల్లోనే పరిమితమా.?

పార్టీకి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు లేదా జాతీయ నాయకులు పాల్గొనే కార్యక్రమాల్లో స్థానిక నాయకులు చురుకుగా కనిపిస్తున్నప్పటికీ, ప్రజల సమస్యలపై అదే స్థాయి చొరవ అసలు కనిపించడం లేదని రాజకీయ ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు. ప్రజలతో నిరంతర సంబంధం కొనసాగించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన సమయంలో పార్టీ కార్యక్రమాలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

### జీహెచ్ఎంసీ ఎన్నికలపై ప్రభావం ఉంటుందా.?

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజా సమస్యలపై బిజెపి పార్టీ వైఖరి ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం చాలా ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పట్టణ ఓటర్లు సిద్ధాంతాలతో పాటు తమ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి, సమస్యల పరిష్కారం, ప్రజలకు అందుబాటులో ఉన్న నాయకత్వాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటారని విశ్లేషకులు భావిస్తున్నారు.

### హిందుత్వం ఒక్కటే సరిపోతుందా.?

హిందుత్వం బీజేపీ ప్రధాన సిద్ధాంతం అయినప్పటికీ ప్రజలు తమ రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసే మౌలిక సమస్యల పరిష్కారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్, ప్రభుత్వ సేవలు వంటి అనేక అంశాలపై బలమైన పోరాటం లేకపోతే కేవలం హిందుత్వ ప్రచారం మాత్రమే ఎన్నికల్లో విజయాన్ని నిర్ధారించదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# రాజధాని కోసం రోడ్లను బలి చేస్తున్నారా.?

**- టిప్పర్ల తాండవం.. గుంతల గోల.. ప్రజల ప్రాణాలతో చెలగాటం - అడ్డరోడ్డు, తాడికొండ మార్గం నరకయాతన**
**- దుమ్ము, బురద, ప్రమాదాలతో ప్రజల విలవిల - అధికారులు కళ్లు తెరవాలంటున్న స్థానికులు**





**అమరావతి (ప్రశ్న న్యూస్)** అమరావతి రాజధాని నిర్మాణ పనులు వేగంగా సాగుతున్న వేళ, అభివృద్ధి పేరుతో ప్రజల ప్రాణాలు పణంగా మారుతున్నాయనే విమర్శలు రోజురోజుకూ బలపడుతున్నాయి. రాజధాని నిర్మాణానికి అవసరమైన మట్టి, ఇసుక, కంకర, సిమెంట్, ఇతర నిర్మాణ సామగ్రిని తరలిస్తున్న వందలాది టిప్పర్ లారీలు అడ్డరోడ్డు--తాడికొండ ప్రధాన రహదారిని పూర్తిగా ధ్వంసం చేశాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు సాఫీగా ప్రయాణించగలిగిన ఈ రహదారి ఇప్పుడు పూర్తిగా గుంతలతో నిండిపోయి, వాహనదారులకు నరకయాతనగా మారింది.ప్రతి రోజూ వందల సంఖ్యలో టిప్పర్ లారీలు అత్యధిక వేగంతో ఈ రహదారిపై దూసుకెళ్తుండటంతో రహదారి ఉపరితలం పూర్తిగా దెబ్బతింది. ఎక్కడ చూసినా పెద్దపెద్ద గుంతలు, విరిగిపోయిన బ్లాక్‌టాప్, ఊడిపోయిన తారు, పైకి వచ్చిన రాళ్లే కనిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఈ గుంతలు కనిపించక ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం ఇప్పటికే ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటుచేసుకున్నాయని ఆవేదన వ్యక్తమవుతోంది. అయినా పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.ఉదయం ఉద్యోగాలకు వెళ్లే ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ సంస్థల సిబ్బంది, విద్యార్థులు ప్రతిరోజూ ఈ రహదారిపై ప్రయాణించాల్సి వస్తోంది. కానీ ప్రతి ప్రయాణం ఇప్పుడు ప్రాణాలతో చేసే సాహసంగా మారింది. గుంతలను తప్పించబోయి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టే పరిస్థితులు తరచూ కనిపిస్తున్నాయి. ద్విచక్రవాహనదారులు గుంతల్లో జారి పడుతున్న ఘటనలు కూడా పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.ఇటీవల కురిసిన వర్షాలతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. గుంతల్లో నీరు నిలిచిపోవడంతో ఏది గుంతో, ఏది రోడో గుర్తుపట్టలేని పరిస్థితి ఏర్పడింది. టిప్పర్ లారీలు వేగంగా వెళ్లినప్పుడు ఆ నీరు, బురద పక్కన వెళ్తున్న ద్విచక్రవాహనదారులు, పాదచారులపై చిందుతోంది. కార్యాలయాలకు శుభ్రంగా బయలుదేరిన ఉద్యోగులు బురదతో తడిసిన దుస్తులతో చేరాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థులు కూడా ఇదే ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు.వర్షం లేని రోజుల్లో మరో సమస్య ప్రజలను వెంటాడుతోంది. టిప్పర్ లారీలు లేపుతున్న దుమ్ము రహదారంతా కమ్మేస్తోంది. కొన్ని క్షణాల పాటు ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించని పరిస్థితి ఏర్పడుతోంది. దుమ్ము నేరుగా ప్రజల ముఖాలపై, కళ్లలోకి, ముక్కులోకి చేరుతోంది. రహదారి పక్కన నివసించే ప్రజలు రోజంతా దుమ్ములోనే గడపాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వైద్యుల అభిప్రాయం ప్రకారం ఇలాంటి నిర్మాణ ప్రాంతాల్లో అధిక దుమ్ము కాలుష్యం వల్ల శ్వాసకోశ సమస్యలు, అలర్జీలు, ఆస్తమా, కంటి సమస్యలు, గొంతు ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు,



గర్భిణీలు, ఇప్పటికే శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.టిప్పర్ లారీల వేగమే మరో ప్రధాన సమస్యగా మారింది. ఇరుకైన రహదారుల్లో కూడా డ్రైవర్లు ఒకరిని మించి మరొకరు పోటీ పడుతూ వాహనాలు నడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎదురుగా వస్తున్న చిన్న వాహనాలకు దారి ఇవ్వకుండా నిర్లక్ష్యంగా ప్రయాణించడం, హారన్‌లతో భయాందోళనలకు గురిచేయడం, ఓవర్‌టేకింగ్‌లు చేయడం వంటి ఘటనలు తరచూ కనిపిస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు.ఈ మార్గంలో పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, కళాశాల విద్యార్థులు, రైతులు, వృద్ధులు అధికంగా ప్రయాణిస్తుంటారు. కానీ టిప్పర్ల వేగం కారణంగా రోడ్డు దాటడమే ప్రాణాంతకంగా మారిందని స్థానికులు అంటున్నారు. స్కూల్ బస్సులు కూడా గుంతలను తప్పించుకుంటూ నెమ్మదిగా వెళ్లాల్సి వస్తుండటంతో పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల నుంచి మరో తీవ్రమైన ఆరోపణ కూడా వినిపిస్తోంది. కొంతమంది టిప్పర్ డ్రైవర్లకు సరైన డ్రైవింగ్ నైపుణ్యం, అవసరమైన లైసెన్సులు ఉన్నాయా లేదా అన్న విషయంపై అధికారులు కఠినంగా తనిఖీలు నిర్వహించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. భారీ వాహనాలు నడిపే డ్రైవర్ల అర్హతలు, వాహనాల ఫిట్‌నెస్, పరిమితి కంటే ఎక్కువ లోడుతో ప్రయాణిస్తున్నారా లేదా అన్న అంశాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని వారు కోరుతున్నారు. ఇటువంటి ఆరోపణలు నిజమైతే సంబంధిత అధికారులు చట్టప్రకారం విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.రాజధాని నిర్మాణం రాష్ట్ర అభివృద్ధికి కీలకమైనదే. కానీ ఆ అభివృద్ధి కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెట్టకూడదని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. నిర్మాణ పనులు ఎంత ముఖ్యమైనవో, ప్రజల భద్రత కూడా అంతే ముఖ్యమని వారు గుర్తుచేస్తున్నారు. అభివృద్ధి అంటే కేవలం భారీ భవనాలు కాదు... ప్రజలు సురక్షితంగా ప్రయాణించే రహదారులు కూడా కావాలని అంటున్నారు.ప్రజలు ప్రభుత్వానికి పలు సూచనలు చేస్తున్నారు. టిప్పర్ లారీల కోసం ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయాలి. అత్యధిక వేగంతో వెళ్లే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. రహదారిపై తరచూ నీరు చల్లి దుమ్మును తగ్గించాలి. దెబ్బతిన్న రహదారిని అత్యవసరంగా మరమ్మతు చేయాలి. వర్షపు నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి. ట్రాఫిక్ పోలీసులు నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలి. భారీ వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ గన్స్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికే ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు జరిగాయని ప్రజలు ఆవేదన



వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో, మరిన్ని ప్రాణనష్టాలు జరిగే వరకు అధికారులు ఎదురుచూడకూడదని స్థానికులు హెచ్చరిస్తున్నారు. రాజధాని నిర్మాణం చరిత్రలో నిలిచిపోయే గొప్ప ప్రాజెక్ట్ కావొచ్చు. అయితే ఆ చరిత్ర ప్రజల కన్నీళ్లతో, ప్రమాదాలతో, ప్రాణనష్టాలతో రాయబడకూడదని ప్రజలు కోరుతున్నారు."రాజధాని నిర్మాణం వేగంగా సాగాలి... కానీ ప్రజల ప్రాణాలను బలి తీసుకునే టిప్పర్ల తాండవానికి వెంటనే అడ్డుకట్ట వేయాలి. అడ్డరోడ్డు--తాడికొండ రహదారిని తక్షణమే మరమ్మతు చేసి, టిప్పర్ లారీల వేగాన్ని నియంత్రించి, దుమ్ము కాలుష్యాన్ని తగ్గించి, ప్రజలకు సురక్షిత ప్రయాణాన్ని కల్పించాలి" అని స్థానికులు ప్రభుత్వాన్ని, జిల్లా యంత్రాంగాన్ని, పోలీసు అధికారులను అత్యవసరంగా కోరుతున్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమాణాలు, 4 గురికి జైలు శిక్ష



**తార్నాక (ప్రశ్న న్యూస్)** ఉస్మానియా యూనివర్సిటీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 64 మంది వాహనదారులను శుక్రవారం నాంపల్లిలోని ఎం.ఆర్. కాంప్లెక్స్‌లోని VIII జేఎంఎఫ్‌సీ (డ్రంక్ అండ్ డ్రైవ్) కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అన్ని కేసులను విచారించి 60 మందికి జరిమానాలు, నలుగురికి జైలు శిక్షలు విధించినట్లు సిఐ సత్యనారాయణ తెలిపారు.నిందితులపై మొత్తం రూ.3,33,400 జరిమానా విధించగా, పునరావృతంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన బికాస్ (30), ప్రభాత్ (29), ఎం. అనిల్ (24), సంగమేశ్వర్ (51)లకు జైలు శిక్షలు ఖరారయ్యాయి. వీరిలో ముగ్గురికి 9 రోజుల సాధారణ జైలు శిక్ష, ఒకరికి 1 రోజు సాధారణ జైలు శిక్ష విధించారు.ఈ కేసుల్లో 48 ద్విచక్ర వాహనాలు, 4 త్రిచక్ర వాహనాలు, 12 నాలుగు చక్రాల వాహనాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. అలాగే 2026 సంవత్సరానికి చెందిన 61 కేసులు, 2025కు చెందిన ఒక కేసు, 2024కు చెందిన ఒక కేసు, 2022కు చెందిన ఒక కేసు కోర్టులో పరిష్కరించబడ్డాయి.
మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాంతక రోడ్డు ప్రమాదాల ప్రమాదం అధికంగా ఉంటుందని ఉస్మానియా యూనివర్సిటీ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపరాదని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు, చట్టపరమైన చర్యలు నిరంతరం కొనసాగుతాయని సిఐ సత్యనారాయణ స్పష్టం చేశారు.

## దొంగ నోటు ఇస్తే కస్టమర్‌కు రసీదు ఇవ్వాలి

**- దేశ సరిహద్దు జిల్లాల బ్యాంకులకు ఆర్‌బిఐ కీలక ఆదేశాలు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో నకిలీ కరెన్సీ చలామణిని అరికట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) మరో కీలక నిర్ణయం తీసుకుంది. పొరుగు దేశాలతో సరిహద్దులు పంచుకుంటున్న జిల్లాల్లోని అన్ని బ్యాంకు శాఖల్లో నోట్ల ప్రామాణికతను పరిశీలించే (అథెంటికేషన్), వేరుచేసే (సార్టింగ్) యంత్రాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. నకిలీ నోట్లను గుర్తించడంలో కొన్ని బ్యాంకుల పనితీరు సంతృప్తికరంగా లేదని గమనించిన ఆర్‌బీఐ, ఈ మేరకు నూతన సర్క్యులర్‌ను విడుదల చేసింది. బ్యాంకులకు వచ్చే ప్రతి నోటు ప్రామాణికతను యంత్రాల ద్వారా విధిగా నిర్ధారించుకోవాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఒకవేళ నకిలీ నోటును గుర్తిస్తే, దాన్ని వెంటనే స్వాధీనం చేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగదారుడికి తిరిగి ఇవ్వకూడదని లేదా బ్యాంకులోనే ధ్వంసం చేయకూడదని తేల్చిచెప్పింది. గుర్తించిన నకిలీ నోట్ల వివరాలను నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా సంబంధిత అధికారులకు నివేదించాలని సూచించింది.ఈ నిబంధనల అమలులో భాగంగా, బ్యాంకుల్లో నగదు లావాదేవీలు నిర్వహించే ప్రతి ఉద్యోగికి అసలు నోట్ల భద్రతా ఫీచర్లపై సమగ్ర శిక్షణ ఇవ్వాలని ఆర్‌బీఐ ఆదేశించింది. ఈ శిక్షణ ప్రక్రియను 2026 అక్టోబర్ 31 నాటికి పూర్తి చేయాలని గడువు విధించింది. నకిలీ నోట్లపై నిఘా ఉంచేందుకు ఏర్పాటు చేసిన 'ఫోర్జ్ నోట్ విజిలెన్స్' (ఎఫ్ఎన్‌వీ) సెల్స్ ద్వారా డేటాను విశ్లేషించి, నకిలీ కరెన్సీ ఎక్కువగా చలామణి అవుతున్న ప్రాంతాలను (హాట్‌స్పాట్‌లు) గుర్తించాలని పేర్కొంది. బ్యాంకులో ఎవరైనా నకిలీ నోటు అందజేస్తే, దానిపై స్టాంప్ వేసి, సదరు వ్యక్తికి నిర్దేశిత నమూనాలో రసీదు ఇవ్వాలని ఆర్‌బీఐ తెలిపింది. ఈ ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని బ్యాంకు శాఖల్లో వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించింది. ఈ పటిష్ట చర్యల ద్వారా నకిలీ కరెన్సీని గుర్తించి, నివేదించే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకుంది.

## రూ. 105 కోట్ల బ్యాంక్ మోసం కేసు

**- హైదరాబాద్, విజయనగరంలో సీబీఐ దాడులు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రముఖ చక్కెర తయారీ సంస్థ 'ఎన్‌సీఎస్ షుగర్స్ లిమిటెడ్'పై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) శుక్రవారం భారీ ఆపరేషన్ చేపట్టింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను (పీఎన్‌బీ) రూ. 105.44 కోట్ల మేర మోసం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో హైదరాబాద్, విజయనగరం, కాకినాడలోని 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. సంస్థ కార్యాలయాలు, ఫ్యాక్టరీతో పాటు డైరెక్టర్ల నివాసాల్లోనూ ఈ తనిఖీలు జరిగాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ చెన్నై శాఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ బెంగళూరు విభాగం ఈ కేసు నమోదు చేసింది. నేరపూరిత కుట్ర, మోసం, నిధుల దుర్వినియోగం వంటి అభియోగాలపై ఎన్‌సీఎస్ షుగర్స్ లిమిటెడ్‌తో పాటు ఆ సంస్థ డైరెక్టర్లు, మరికొందరు గుర్తు తెలియని ప్రభుత్వ ఉద్యోగులపై కేసులు నమోదయ్యాయి.రుణాలు పొందేందుకు నిందితులు నకిలీ పత్రాలను బ్యాంకుకు సమర్పించినట్లు సీబీఐ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించింది. అలా పొందిన రుణాలను అసలు వ్యాపార అవసరాలకు ఉపయోగించకుండా, ఇతర మార్గాలకు మళ్లించి దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సకాలంలో రుణాలు చెల్లించకపోవడంతో బ్యాంకుకు రూ. 105.44 కోట్ల మేర ఆర్థిక నష్టం వాటిల్లింది. ఈ సోదాల్లో కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నామని, నిధుల మళ్లింపుపై లోతుగా దర్యాప్తు చేస్తున్నామని సీబీఐ అధికారులు వెల్లడించారు. కాగా, గతంలో 2017లోనూ 'ప్రాజెక్ట్ అండ్ ఎక్విప్‌మెంట్ కార్పొరేషన్'కు రూ. 82.11 కోట్లు మోసం చేసిన కేసులో ఎన్‌సీఎస్ షుగర్స్ సంస్థకు చెందిన ఇద్దరు అధికారులపై సీబీఐ కేసు నమోదు చేయడం గమనార్హం.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588